



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 272 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు శనివారం 6 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :272 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SAT 6 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




# ఎండను లెక్కచేయకుండా..

## విశాఖ రోడ్లపై సీఎం చంద్రబాబు సైకిల్ సవారీ

- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సైకిల్ తొక్కిన సీఎం చంద్రబాబు
- విశాఖ ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సాగిన ర్యాలీ
- 5.5 కిలోమీటర్ల దూరాన్ని 21 నిమిషాల్లో పూర్తి చేసిన ముఖ్యమంత్రి
- సీఎంతో పాటు పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు

పెన్ పవర్ డెస్క్:ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖపట్నంలో సైకిల్ సవారీ చేశారు. నగరంలోని ఆంధ్ర యూనివర్సిటీ (ఏయూ) గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ హోటల్ వరకు జరిగిన ఈ ర్యాలీలో ఆయన ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం 5.5 కిలోమీటర్ల దూరాన్ని 21 నిమిషాల 18 సెకండ్లలో పూర్తి చేశారు.ఈ సైకిల్ యాత్ర ఏయూ గ్రౌండ్స్‌లో ప్రారంభమై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, పోలమాంబ గుడి, వాల్తేరు, బీచ్ రోడ్ మీదుగా నోవాటెల్ హోటల్ వద్ద ముగిసింది. ర్యాలీ సమయంలో ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ, చంద్రబాబు ఏమాత్రం అలసట లేకుండా సైకిల్ తొక్కుతూ ముందుకు సాగారు. దారిపొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ ఆయన తన ప్రయాణాన్ని కొనసాగించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వెంట జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని సైకిల్ తొక్కారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీని నిర్వహించారు.

## ఏపీలో చిన్న న్యూక్లియర్ రియాక్టర్లు...

### రష్యా దిగ్గజం రోసాటమ్‌కు లోకేష్ ప్రతిపాదన

- రష్యా పర్యటనలో ఏపీకి పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి నారా లోకేష్ చర్చలు
- అణు విద్యుత్, డీశాలినేషన్ ప్లాంట్ల ఏర్పాటుకు రోసాటమ్‌కు ప్రతిపాదనలు
- అల్యూమినియం ప్లాంట్లు, రిఫైనరీల ఏర్పాటుకు రుసాల్ సంస్థకు ఆహ్వానం
- ఆర్కిటిక్ సముద్ర మార్గం ద్వారా ఏపీకి వాణిజ్య అవకాశాలపై సదస్సులో ప్రసంగం
- లోకేష్ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చిన రష్యా కంపెనీలు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ రష్యా పర్యటనలో కీలక అడుగులు వేస్తున్నారు. తన పర్యటనలో నాలుగో రోజు, ఆయన సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ప్రపంచ ప్రఖ్యాత అణుశక్తి దిగ్గజం రోసాటమ్ , అల్యూమినియం

- మిగతా 2లో



## ఆంధ్రా రొయ్య.. ప్రపంచస్థాయికి వెళ్లాలి: విశాఖ ఆక్వా సదస్సులో చంద్రబాబు



- బ్లూ ఎకానమీకి ఆంధ్రప్రదేశ్‌ను కేంద్ర బిందువుగా తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబు వెల్లడి
- అమరావతి నుంచి నెల్లూరు వరకు ఆక్వా కారిడార్ అభివృద్ధికి ప్రణాళిక
- భారత సముద్ర ఆహార ఎగుమతుల్లో ఏపీ వాటా 38 శాతం అని వెల్లడి
- ఆక్వా రంగ అభివృద్ధికి కేంద్రానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ
- 'ఆంధ్రా ష్రింప్.. ఇండియా సీ-ఫుడ్' అనే బ్రాండ్ స్థాపించాలని పిలుపు

పెన్ పవర్ డెస్క్:భవిష్యత్ అంతా బ్లూ ఎకానమీదేనని, భారతదేశ బ్లూ ఎకానమీకి ఆంధ్రప్రదేశ్‌ను కేంద్ర బిందువుగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడంలో ఆక్వా రంగం అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరిగిన సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆక్వా రంగ అభివృద్ధికి తన

- మిగతా 2లో



## డీఎస్సీపై ప్రభుత్వం ఫుల్ క్లారిటీ..

### హారిజాంటల్ రిజర్వేషన్‌పై సుదీర్ఘ వివరణ

- డీఎస్సీ నియామకాల్లో హారిజాంటల్ రిజర్వేషన్ పై ప్రభుత్వ సమగ్ర వివరణ
- జీవో 77 ప్రకారమే పోస్టుల భర్తీ, సుప్రీంకోర్టు ఆదేశాల అమలు అని వెల్లడి
- వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్ల మధ్య తేడాను ఉదాహరణలతో స్పష్టం చేసిన అధికారులు
- స్పోర్ట్స్ కోటా, దివ్యాంగుల కోటా ఎంపికలు నిబంధనల ప్రకారమే జరిగాయని వెల్లడి
- కాల్ లెటర్ వస్తే ఉద్యోగం వచ్చినట్లు కాదు, అది కేవలం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసమేనని స్పష్టీకరణ

2లో



## జనసేన పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేష్...

- జనసేన రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేష్
- అధికారికంగా ఖరారు చేసిన పవన్ కల్యాణ్
- శనివారం మధ్యాహ్నం నామినేషన్ దాఖలు చేయనున్న రమేష్
- కష్టకాలంలో నిలిచినందుకే పదవి అన్న జనసేన
- 2015 నుంచి పవన్ వెన్నంటి ఉన్న లింగమనేని రమేష్

- మిగతా 2లో



## కేరళను ముంచెత్తుతున్న భారీ వర్షాలు..

### ఐఎండీ హెచ్చరిక

- కేరళలో తీవ్రరూపం దాల్చిన నైరుతి రుతుపవనాలు
- ఐదు ఉత్తర జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ
- శనివారం అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక
- పలుచోట్ల ఈదురు గాలులకు నేలకూలిన చెట్లు
- కొండ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

- మిగతా 2లో

## భారత్‌తో కలిసి ఎస్‌యూ-57 ఫైటర్ జెట్ రూపొందించడానికి సిద్ధం



- ఎస్‌యూ-57 యుద్ధ విమానాలను సంయుక్తంగా అభివృద్ధి చేద్దామన్న పుతిన్
- టెక్నాలజీ బదిలీపై ఎలాంటి ఆంక్షలు ఉండవని స్పష్టం
- స్వదేశీ AMCA ప్రాజెక్టు ఆలస్యం నేపథ్యంలో రష్యా ప్రతిపాదన
- గతంలో అధిక వ్యయంతో నిలిచిపోయిన ఫైటర్ జెట్ ఒప్పందానికి మళ్లీ తెర
- ప్రస్తుతానికి ఇదే అత్యుత్తమ యుద్ధ విమానమని పుతిన్ వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:భారత్‌తో రక్షణ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలక ప్రతిపాదన చేశారు. ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ అయిన 'సుఖోయ్-57'ను భారత్‌తో కలిసి ఉమ్మడిగా అభివృద్ధి చేసేందుకు, ఉత్పత్తి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఈ యుద్ధ విమానానికి

- మిగతా 2లో

## మంత్రులకు శాఖల కేటాయింపు నా చేతుల్లో లేదు



- కర్ణాటకలో కొత్త ప్రభుత్వంలో మొదలైన విభేదాలు
- మంత్రి పదవికి రాజీనామా చేసిన సీనియర్ నేత రామలింగారెడ్డి
- బెంగళూరు అభివృద్ధి శాఖ దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తి
- ఇది అధిష్ఠానం నిర్ణయమని స్పష్టం చేసిన సీఎం డీకే శివకుమార్
- రామలింగారెడ్డితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని వెల్లడి

- మిగతా 2లో



## యుద్ధానికి ముగింపు పలుకుదాం.. పుతిన్‌కు జెలెన్‌స్కీ బహిరంగ లేఖ

- యుద్ధాన్ని ముగించేందుకు నేరుగా చర్చలు జరపాలని ప్రతిపాదన
- లేఖను పుతిన్ చదివారని వెల్లడించిన క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్
- చర్చలకు తాము సిద్ధంగానే ఉన్నామని రష్యా ప్రకటన
- స్విట్జర్లాండ్, టర్కీ వంటి దేశాల్లో భేటీకి జెలెన్‌స్కీ సూచన

పెన్ పవర్ డెస్క్:ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ముగింపు పలికే దిశగా అనూహ్య పరి ణామం చోటుచేసుకుంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో నేరుగా చర్చలు జరిపేందుకు సిద్ధమని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ

- మిగతా 2లో



## తమిళనాడులో బీజేపీకి దెబ్బ మీద దెబ్బ..

### అన్నామలై కోసం వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ రాజీనామా

పెన్ పవర్ డెస్క్:తమిళనాడులో భారతీయ జనతా పార్టీకి దెబ్బ మీద దెబ్బ తగులు తోంది. ఆ పార్టీ మాజీ అధ్యక్షుడు అన్నామలై రాజీనామా త ర్వాత.. అదే బాటలో సీనియర్ లీడర్లు పార్టీని వీడుతున్నారు.

- మిగతా 2లో

## కామారెడ్డి జిల్లాలో విషాదం.. నదిలో దిగి ముగ్గురి మృతి

- కామారెడ్డి జిల్లా మంజీరా నదిలో ఘోర ప్రమాదం
- స్నానానికి దిగి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి
- మృతులు అనిత (40), పావని (14), శివాని (13)గా గుర్తింపు
- ప్రమాదం నుంచి ఒకరిని సురక్షితంగా కాపాడిన స్థానికులు
- ఎల్లమ్మ గుడికి మొక్కులు తీర్చుకోవడానికి వెళ్లగా ఘటన

పెన్ పవర్ డెస్క్:కామారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం చోటుచే సుకుంది. మంజీరా నదిలో స్నానానికి దిగి ఒకే కుటుంబానికి

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

## యుద్ధానికి ముగింపు పలుకుదాం.. పుతిన్‌కు జెలెన్‌స్కీ బహిరంగ లేఖ

- మొదటి పేజి తరువాయి

ప్రతిపాదించారు. ఈ మేరకు ఆయన పుతిన్‌కు రాసిన ఒక బహిరంగ లేఖను పుతిన్ స్వీకరించి, పూర్తిగా చదివినట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం (క్రెమ్లిన్) అధికారికంగా వెల్లడించింది. రష్యా అగ్రశ్రేణి వార్తా సంస్థ 'టాస్' కథనం ప్రకారం, సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక ఫోరమ్ సదస్సు సందర్భంగా పుతిన్ ప్రెస్ సెక్రటరీ డిమిత్రి పెస్కోవ్ ఈ విషయాన్ని ధృవీకరించారు."మన మధ్య ప్రత్యక్ష చర్చల ద్వారా ఈ యుద్ధానికి ముగింపు పలుకుదాం. ఇందుకోసం నేను ఒక సమావేశాన్ని ప్రతిపాదిస్తున్నాను" అని జెలెన్‌స్కీ తన లేఖలో పేర్కొన్నారు. "యూరప్ దృష్టి మళ్లీ ఈ యుద్ధంపై పడే వరకు వేచి చూడటం సరికాదు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ శాంతి చర్చలకు ఆతిథ్యం ఇచ్చేందుకు స్విట్జర్లాండ్, టర్కీ, అరబ్ దేశాలు ముందుకు రావాలని ఆయన సూచించారు. చర్చలకు స్పష్టమైన తేదీని నిర్ణయించుకోవాలని కూడా ప్రతిపాదించారు.చర్చలు జరిగేంత కాలం పూర్తిస్థాయి కాల్పుల విరమణకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని జెలెన్‌స్కీ తన లేఖలో హామీ ఇచ్చారు. "ఇది ప్రామాణికమైన పద్ధతి. ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి నిజమైన నిశ్శబ్దాన్ని నెలకొల్పడమే ఉత్తమ మార్గం. ఇది కేవలం ప్రయత్నం కాదు, మీకు నిజంగా ఆసక్తి ఉంటే ఇది నిజమైన కాల్పుల విరమణ అవుతుంది" అని ఆయన వివరించారు. ఈ లేఖపై ప్రపంచ దేశాల నేతల నుంచి వచ్చిన స్పందనల గురించి కూడా పుతిన్‌కు తెలియజేశామని పెస్కోవ్ తెలిపారు.ఈ పరిణామంపై పెస్కోవ్ స్పందిస్తూ, చర్చలను పునఃప్రారంభించాలని రష్యా కోరుకుంటోందని అన్నారు. "ప్రస్తుతం నెలకొన్న స్తబ్ధత త్వరలోనే ముగుస్తుందని, చర్చలు మళ్లీ మొదలవుతాయని ఆశిస్తున్నాం. ఇప్పటికే అమెరికాతో పలు మార్గాల్లో సంప్రదింపులు జరుపుతున్నాం" అని ఆయన తెలిపారు. "పుతిన్ చర్చలకు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. రష్యాతో మాట్లాడకూడదనే తమ వైఖరిని యూరప్ దేశాలు విడిచిపెడితే, వారు కేవలం ఫోన్ చేసి మాట్లాడితే సరిపోతుంది" అని పెస్కోవ్ వ్యాఖ్యానించారు. అయితే, ఉక్రెయిన్‌తో వివాదం చాలా సంక్లిష్టమైనదని, అది అంత సులభంగా పరిష్కారమయ్యేది కాదని కూడా ఆయన అభిప్రాయపడినట్లు టాస్ నివేదించింది.

### తమిళనాడులో బీజేపీకి దెబ్బ మీద దెబ్బ.. అన్నామలై కోసం వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ రాజీనామా

- మొదటి పేజి తరువాయి

లేటెస్టుగా 2026 జూన్ 05న.. పార్టీ వైస్ ప్రసిడెంట్ కరు నాగరాజన్ బీజేపీకి రాజీనామా చేశారు. తన వైస్ ప్రసిడెంట్ పదవికి రాజీనామాచేసిన ఆయన.. పార్టీ అధిష్టానానికి రాజీనామా లేఖ పంపనున్నట్లు తెలిపారు. అన్నామలైని చెన్నై ఎయిర్ పోర్టులో కలిసిన ఆయన.. ఆయనకు మద్ధతుగా ఆయనతోనే ఉంటానని ప్రకటించారు.మరోవైపు స్టేట్ సెక్రటరీ సుమతీ వెంకటేష్ కూడా పార్టీకి రాజీనామా చేశారు. చాలా జాగ్రత్తగా ఆలోచించాకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పార్టీ వీడుతున్నందుకు చాలా బాధపడుతున్నట్లు తెలిపారు. తమిళ రాజకీయాల్లో నాగరాజన్ ప్రముఖ పేరున్న నేత. టీవీ డిబేట్లలో పార్టీ వాయిస్ ను వినిపిస్తూ పాపులర్ అయ్యారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో మైలపూర్, 2017 లో ఆర్కే నగర్ ఉప ఎన్నికల్లో పోటీ చేశారు. రెండు చోటా భారీ తేడాతో ఓడిపోయారు. 2017 బైపోల్స్ లో ఏఎంఎంకే చీఫ్? దినకరన్ గెలవగా.. నాగరాజన్ నోటా కంటే తక్కువ ఓట్లు తెచ్చుకున్నారు.

**అన్నామలై రాజీనామా:**

తమిళనాడు బీజేపీ ఫైర్‌బ్రాండ్, ఆ పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై తన పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ద్రవిడ రాజకీయాలలో బీజేపీకి ఆశాకిరణంలా కనిపించిన అన్నామలై.. అక్కడ ఊహించినంత ఊపు తేలేకపోయారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం పాలైంది. అయితే పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పించినందుకా లేక కాశాయ రాజకీయాలు అక్కడ నడవటం లేదనో కానీ.. సొంత కుంపటి పెట్టుకునేందుకు సిద్ధమైన అన్నమలై..రాజీనామా చేయడం దేశ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఆయన రాజీనామాకు అధిష్టానం సైతం ఆమోదం తెలిపింది. కర్ణాటక కేడర్‌కు చెందిన మాజీ ఐపీఎస్ అధికారి అయిన అన్నామలై.. పోలీస్ ఉద్యోగానికి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. పార్టీ అధిష్టానం ఆయనపై నమ్మకంతో అతి తక్కువ కాలంలోనే తమిళనాడు బీజేపీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించింది.బీజేపీ పార్టీకి రాజీనామా చేసిన కె.అన్నామలై.. కొత్త రాజకీయ పార్టీ పెడుతున్నట్లు ప్రకటించారు. తమిళనాడు రాజకీయాల్లో కొత్త పార్టీ అవసరం ఉందని.. కామన్ మ్యాన్ పాలిటిక్స్ రావాల్సి ఉందని.. ఆ దిశగానే రాజకీయ పార్టీ ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు . రాబోయే 2029 పార్లమెంట్ ఎన్నికల్లోనూ పోటీ చేస్తామని.. ఆ తర్వాత 2031లో జరగబోయే తమిళనాడు ఎన్నికల్లో అన్ని స్థానాలకు పోటీ చేస్తామన్నారాయన. ఈ ఐదేళ్లల్లో రాజకీయ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేస్తానని స్పష్టం చేశారు అన్నామలై.

## కామారెడ్డి జిల్లాలో విషాదం.. నదిలో దిగి ముగ్గురి మృతి

- మొదటి పేజి తరువాయి

చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన బాన్సువాడ మండల పరిధిలో శు క్రవారం జరిగింది.వివరాల్లోకి వెళితే.. పిట్లం మండలం మంగళ్ కిష్టాపూర్ గ్రామానికి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు బాన్సువాడ మండలం బుడిమి సమీపంలోని ఎల్లమ్మ ఆలయానికి మొక్కులు చెల్లించుకోవడానికి వెళ్లారు. దర్శనం అనంతరం దగ్గరలోని మంజీరా నదిలో పుణ్యస్నానం చేసేందుకు దిగారు. అయితే, నీటి లోతు, ప్రవాహం ఎక్కువగా ఉండటంతో వారు అదుపుతప్పి గల్లంతయ్యారు.వారి అరుపులు విన్న స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో భాను ప్రసాద్ అనే వ్యక్తిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగారు. కానీ, అప్పటికే అనిత (40), ఆమె కుమార్తెలు పావని (14), శివాని (13) నీట మునిగి మృతి చెందారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, స్థానికుల సహాయంతో మృతదేహాలను వెలికితీశారు. ఒకే కుటుంబంలో తల్లి, ఇద్దరు కుమార్తెలు మరణించడంతో వారి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## భారత్‌తో కలిసి ఎస్‌యూ-57 ఫైటర్ జెట్ రూపొందించడానికి సిద్ధం

- మొదటి పేజి తరువాయి

సంబంధించిన పూర్తి సాంకేతికతను బదిలీ చేసేందుకు ఎలాంటి ఆంక్షలు విధించబోమని ఆయన స్పష్టం చేశారు. గురువారం రాత్రి అంతర్జాతీయ వార్తా సంస్థల ప్రతినిధులతో మాట్లాడిన సందర్భంగా పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రస్తుతం అందుబాటులో ఉన్న యుద్ధ విమానాల్లో ఎస్‌యూ-57 అత్యుత్తమమైనదని నేను భావిస్తున్నాను. ఈ ఐదో తరం విమానాన్ని సంయుక్తంగా అభివృద్ధి చేద్దామని భారత మిత్రులకు మేం ప్రతిపాదించాం. ఈ విషయంలో కలిసి పనిచేయడానికి రష్యా సిద్ధంగా ఉంది, దీనిపై ఎటువంటి పరిమితులు ఉండవు" అని పుతిన్ వివరించారు.ప్రస్తుతం భారత్ 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమంలో భాగంగా స్వదేశీ పరిజ్ఞానంతో ఐదో తరం ఫైటర్ జెట్ 'అడ్వాన్స్‌డ్ మల్టీరోల్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్' (ఆమ్కా)ను అభివృద్ధి చేస్తోంది. అయితే, ఈ ప్రాజెక్టు 2035 నాటికి గానీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో, మధ్యంతర అవసరాల కోసం రెండు స్క్వాడ్రన్ల (సుమారు 36) ఎస్‌యూ-57 విమానాలను కొనుగోలు చేసే దిశగా భారత ప్రభుత్వం యోచిస్తోంది. గతంలోనే భారత్, రష్యా కలిసి ఐదో తరం ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టును చేపట్టినప్పటికీ, సుమారు 30 బిలియన డాలర్ల భారీ వ్యయం కారణంగా 2021లో అది నిలిచిపోయింది. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా నుంచి ఆయుధాల సరఫరాలో జాప్యం జరుగుతుండటంతో భారత్ ఇతర దేశాల వైపు కూడా దృష్టి సారిస్తోంది. ఈ తరుణంలో పుతిన్ చేసిన తాజా ప్రతిపాదన ప్రాధాన్యత సంతరించుకుంది. 'మేక్ ఇన్ ఇండియా' నిబంధనలకు అనుగుణంగా భారత్‌లోనే విమానాల తయారీ, పూర్తి సాంకేతిక పరిజ్ఞాన బదిలీతో పాటు భారతీయ ఆయుధాలను ఈ విమానాలకు అనుసంధానించే వెసులుబాటు కూడా ఈ ప్రతిపాదనలో ఉన్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి.

# ఆంధ్రా రొయ్య.. ప్రపంచస్థాయికి వెళ్లాలి: విశాఖ ఆక్వా సదస్సులో చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వ దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. భారతదేశ సముద్ర ఆహార ఉత్పత్తిలో, ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే అగ్రస్థానంలో ఉందని చంద్రబాబు గణాంకాలతో వివరించారు. "దేశ మొత్తం చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా 28 శాతం, రొయ్యల ఉత్పత్తిలో ఏకంగా 66 శాతం మనదే. దేశ సముద్ర ఆహార ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయంలో 38 శాతం, అంటే సుమారు రూ.28,000 కోట్లకు పైగా ఏపీ నుంచే సమకూరుతోంది. ప్రపంచ సీ-ఫుడ్ వ్యాపారంలో భారత్ వాటా కేవలం 5 శాతమే ఉంది. దీన్ని పెంచడానికి అపార అవకాశాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందితే, దేశ ఎగుమతులు కూడా వృద్ధి చెందుతాయి" అని ఆయన అన్నారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో ఆక్వా రంగం సమగ్రాభివృద్ధికి ఒక బృహత్ ప్రణాళికను చంద్రబాబు ప్రకటించారు. అమరావతి, భీమవరం, కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం, నెల్లూరు ప్రాంతాలను కలుపుతూ ఒక 'ఆక్వా కారిడార్' అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. "ఈ కారిడార్‌లో పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, ఆధునిక టెక్నాలజీతో కూడిన ఒక సమగ్ర ఎకో సిస్టం ఏర్పాటు చేస్తాం. అతి తక్కువ వ్యయంతో అత్యధిక ఉత్పత్తి సాధించడమే మా లక్ష్యం. 'పాండ్ టు పోర్టు, ఫార్మర్ టు గ్లోబల్ కన్స్యూమర్' అనే విధానంతో ముందుకు సాగుతాం" అని తెలిపారు. 'ఆంధ్రా రొయ్య... ఇండియా సీ-ఫుడ్' అనే బ్రాండ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఆక్వా రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్యకు రాష్ట్రం పూర్తి సహకారం అందిస్తుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. కేంద్ర మత్స్య శాఖ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు 15 రోజుల్లోగా అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని ప్రకటించారు. కాకినాడ పోర్టు ఆధునికీకరణకు కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ హామీ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. మెగా సీ-ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తోందని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై చంద్రబాబు ప్రశంసల వర్షం కురిపించారు. "21వ శతాబ్దం నరేంద్ర మోదీదే. సరైన సమయంలో దేశానికి దొరికిన సరైన నేత ఆయన. భవిష్యత్తులో భారత దేశాన్ని అగ్రస్థానంలో నిలపడానికి ప్రధాని మోదీ అద్భుతంగా కృషి చేస్తున్నారు. ఆయనను మరింత బలపర్చాల్సిన అవసరం ఉంది" అని చంద్రబాబు అన్నారు. ఈ సమావేశానికి తాను సైకిల్‌పై వచ్చానని, సైక్లింగ్ ద్వారా ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఖర్చులు కూడా తగ్గుతాయని సూచించారు. ఆక్వా ఉత్పత్తుల్లో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుందని, ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## జనసేన పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేష్...

జనసేన పార్టీకి కేటాయించిన రాజ్యసభ స్థానానికి అభ్యర్థిగా పారిశ్రామికవేత్త లింగమనేని రమేష్ పేరును పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అధికారికంగా ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. లింగమనేని రమేష్ శనివారం మధ్యాహ్నం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు.
రమేష్ 2015 నుంచి పవన్ కల్యాణ్‌తో, జనసేన పార్టీతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధికి సామాజిక వర్గాల మధ్య సఖ్యత, సోషల్ ఇంజినీరింగ్ అవసరమనే పవన్ ఆలోచనా విధానానికి ఆకర్షితులై ఆయనకు వెన్నుదన్నుగా నిలిచినట్లు పార్టీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.2019 ఎన్నికల్లో పార్టీకి ప్రతికూల ఫలితాలు వచ్చినప్పటికీ, రమేష్ పార్టీ సిద్ధాంతాలపై, పవన్ కల్యాణ్ నాయకత్వంపై పూర్తి విశ్వాసంతో నిలిచారని జనసేన తెలిపింది. ఎన్నో ఒత్తిళ్లు, సవాళ్లు ఎదురైనా పార్టీకి అండగా నిలిచిన వారికి కుల, మతాలు పరిగణనలోకి తీసుకోకుండా నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలనే సూత్రం ప్రకారమే ఈ ఎంపిక జరిగినట్లు స్పష్టం చేసింది. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచినందుకే ఆయనకు ఈ అవకాశం కల్పించినట్లు పార్టీ వర్గాలు వివరించాయి.

# డీఎస్సీపై ప్రభుత్వం ఫుల్ క్లారిటీ.. హారిజాంటల్ రిజర్వేషన్‌పై సుదీర్ఘ వివరణ

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ నియామకాలపై అభ్యర్థులు, మీడియా, సోషల్ మీడియాలో వ్యక్తమవుతున్న సందేహాలు, ఆరోపణలపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో వివరణ ఇచ్చింది. పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్, శాప్ ఎండీ భరణి తదితర ఉన్నతాధికారులు మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ప్రతి నియామకం నిబంధనల మేరకే జరిగిందని, ఎక్కడా ఎలాంటి అక్రమాలకు తావులేదని తేల్చిచెప్పారు. ముఖ్యంగా, హారిజాంటల్ రిజర్వేషన్ విధానంపై చాలా మందికి సరైన అవగాహన లేకపోవడం వల్లే ఈ అపోహలు తలెత్తుతున్నాయని వారు పేర్కొన్నారు.

**వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లు అంటే ఏమిటి?**

ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో రెండు రకాల రిజర్వేషన్లు అమలవుతాయని అధికారులు వివరించారు. అవి వర్టికల్ (నిలువు) మరియు హారిజాంటల్ (అడ్డం) రిజర్వేషన్లు.
వర్టికల్ రిజర్వేషన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వంటి సామాజిక వర్గాలకు కల్పించే రిజర్వేషన్‌ను వర్టికల్ రిజర్వేషన్ అంటారు. దీనికోసం 100 పాయింట్ల రోస్టర్ విధానం అమల్లో ఉంటుంది. ఇందులో ప్రతి కేటగిరీకి నిర్దిష్ట రోస్టర్ పాయింట్లు కేటాయించి ఉంటాయి. ఈ కేటగిరీలకు చెందిన అభ్యర్థులు మెరిట్ ఆధారంగా ఓపెన్ కేటగిరీలో కూడా పోటీ పడవచ్చు. దీనివల్ల కొన్నిసార్లు ఆయా వర్గాలకు నిర్దేశించిన శాతం కంటే ఎక్కువ మంది ఎంపికయ్యే అవకాశం ఉంటుంది.
హారిజాంటల్ రిజర్వేషన్: మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు, క్రీడాకారులు వంటి ప్రత్యేక కేటగిరీలకు కల్పించేది హారిజాంటల్ రిజర్వేషన్. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం, ఈ కేటగిరీలకు నిర్దిష్ట రోస్టర్ పాయింట్లు ఉండవు. మొత్తం నియామకాల్లో నిర్దేశిత శాతం (ఉదాహరణకు మహిళలకు 33.3%) ఉండేలా చూడటమే దీని ఉద్దేశం.
పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ ఈ విధానాన్ని ఒక బస్సు ఉదాహరణతో సులభంగా వివరించారు. "ఒక బస్సులో 100 మంది ప్రయాణికులను ఎక్కించాలనుకుంటే, అందులో 33 మంది మహిళలు తప్పనిసరిగా ఉండాలి. లైన్‌లో ఉన్నవారిని వరుసగా ఎక్కిస్తున్నప్పుడు, మొదటి 66 మందిలోనే 33 మంది మహిళలు ఉంటే, మిగతా సీట్లను లైన్ ప్రకారం భర్తీ చేస్తాం. ఒకవేళ అలా జరగకపోతే, 66 మంది తర్వాత లైన్‌ను ఆపి, చివర్లో ఉన్న మహిళలను ముందుకు పిలిచి బస్సు ఎక్కిస్తాం. అప్పుడు లైన్‌లో ముందున్న పురుషులు అన్యాయం జరిగిందంటే కుదరదు. ఎందుకంటే రిజర్వేషన్ విధానం అదే" అని ఆయన స్పష్టం చేశారు.

**జీవో 77 అమలు, సుప్రీంకోర్టు ఆదేశాలు**

గతంలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా హారిజాంటల్ రిజర్వేషన్ కేటగిరీలకు వర్టికల్ విధానంలోనే రోస్టర్ పాయింట్లు కేటాయించేవారని, అయితే సుప్రీంకోర్టు పలు తీర్పులలో (అనిల్ గుప్తా కేసు, రాజేష్ కుమార్ దరియా కేసు) ఈ విధానం సరికాదని స్పష్టం చేసిందని అధికారులు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర నిబంధనలను మార్చేందుకు ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది.
ఆ కమిటీ సిఫార్సుల మేరకు 2023 ఆగస్టు 2న జీవో 77 జారీ చేయబడింది. ఈ జీవో ప్రకారమే మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు, క్రీడాకారుల కోటాను హారిజాంటల్ విధానంలో భర్తీ చేశారు. డీఎస్సీ-2024 ఈ జీవో తర్వాత జరిగిన మొదటి పెద్ద నియామక ప్రక్రియ కావడంతో, అభ్యర్థుల్లో గందరగోళం నెలకొందని వారు అభిప్రాయపడ్డారు.

**అభ్యర్థుల ఆరోపణలు - అధికారుల వివరణ**

గత కొద్దిరోజులుగా మీడియా, సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న సుమారు 26 కేసులను అధికారులు ఉదాహరణలుగా తీసుకుని వివరణ ఇచ్చారు.
కాల్ లెటర్ వచ్చినా ఉద్యోగం రాలేదు: కాల్ లెటర్ కేవలం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసమేనని, అది ఉద్యోగ నియామకానికి హామీ కాదని ప్రతి కాల్ లెటర్‌లో స్పష్టంగా పేర్కొన్నామని తెలిపారు. 1:1 పద్ధతిలో వెరిఫికేషన్‌కు పిలిచినప్పుడు, కొన్ని ప్రత్యేక కేటగిరీలలో (ఉదా: దివ్యాంగులు) అర్హులైన అభ్యర్థులు చివరి నిమిషంలో అందుబాటులోకి వస్తే, మెరిట్ జాబితాలో మార్పులు జరగడం సహజమని, దానివల్ల మొదట పిలిచిన వారికి అవకాశం కోల్పోయే పరిస్థితి రావచ్చని వివరించారు.
తక్కువ ర్యాంకు వారికి ఉద్యోగం: ఇది పూర్తిగా హారిజాంటల్ రిజర్వేషన్ అమలు వల్లే జరిగిందని స్పష్టం చేశారు. ఒక కేటగిరీలో (ఉదా: బీసీ-ఏ) మహిళా అభ్యర్థులు నిర్దేశిత సంఖ్యలో లేనప్పుడు, మెరిట్ జాబితాలో చివరన ఉన్న పురుష అభ్యర్థిని తొలగించి, ఆ కేటగిరీకి చెందిన మహిళా అభ్యర్థికి (ర్యాంకుతో సంబంధం లేకుండా) అవకాశం కల్పించడం జరిగిందన్నారు.
స్పోర్ట్స్ కోటా వివాదాలు: స్పోర్ట్స్ కోటా ఎంపిక ప్రక్రియను శాప్ (శాప్) ఎండీ వివరించారు.
సర్టిఫికెట్ల ప్రామాణికత: క్రీడా సర్టిఫికెట్లను ప్రభుత్వం కాకుండా, సంబంధిత క్రీడా సంఘాలు, సమాఖ్యలు జారీ చేస్తాయని, వాటి ప్రామాణికతను నిర్ధారించుకున్న తర్వాతే పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు.ఆన్‌లైన్ దరఖాస్తే అంతిమం: అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఏ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేశారో వాటిని మాత్రమే పరిగణనలోకి తీసుకున్నామని స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించినా, ఆన్‌లైన్‌లో ఆ సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేయని ఒక అభ్యర్థి కేసును ఉదాహరణగా చూపారు.ప్రాధాన్యతా క్రమం: జీవో 4 ప్రకారం ఒలింపిక్స్ నుంచి రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్ వరకు ప్రాధాన్యత ఉంటుందని, ఆ క్రమంలోనే ఎంపికలు జరిగాయని వివరించారు. టీమ్ ఈవెంట్ల కంటే వ్యక్తిగత ఈవెంట్లకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.
ఇతర కారణాలు: సరైన భాషా అర్హతలు లేకపోవడం (తెలుగు మీడియం పోస్టుకు తెలుగు సబ్జెక్టు చదవకపోవడం), మెడికల్ బోర్డు నిర్ధారణలో దివ్యాంగ శాతం 40% కంటే తక్కువగా ఉండటం వంటి కారణాలతో కొందరిని అనర్హులుగా ప్రకటించామని తెలిపారు.

**పారదర్శకతే మా విధానం**

మొత్తం 16,347 పోస్టులకు గాను 15,941 మంది అభ్యర్థులను ఎంపిక చేశామని, ప్రతి ఎంపిక నిబంధనల మేరకే జరిగిందని అధికారులు పునరుద్ఘాటించారు. ఎంపికైన వారి జాబితాలు, వారికి వచ్చిన మార్కులు, కేటగిరీ వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని, ఎవరికైనా సందేహాలుంటే కమిషనర్ కార్యాలయంలో సంప్రదించవచ్చని సూచించారు. భవిష్యత్తులో జరిగే టెట్, డీఎస్సీ పరీక్షలకు ముందు హారిజాంటల్ రిజర్వేషన్ విధానంపై అభ్యర్థులకు పూర్తి అవగాహన కల్పించేందుకు 'తరచుగా అడిగే ప్రశ్నలు' వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు

## మంత్రులకు శాఖల కేటాయింపు నా చేతుల్లో లేదు

కర్ణాటకలో డీకే శివకుమార్ నేతృత్వంలోని నూతన ప్రభుత్వంలో అప్పుడే అసమ్మతి సెగలు మొదలయ్యాయి. తాను ఆశించిన బెంగళూరు అభివృద్ధి శాఖ దక్కలేదన్న అసంతృప్తితో సీనియర్ మంత్రి ఆర్. రామలింగారెడ్డి తన పదవికి రాజీనామా చేయడం తెలిసిందే. అయితే, శాఖల కేటాయింపు తన చేతుల్లో లేదని, అది పూర్తిగా కాంగ్రెస్ అధిష్ఠానం పరిధిలోని అంశమని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు.ఇటీవలే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన డీకే శివకుమార్‌కు ఈ పరిణామం తొలి సవాల్‌గా మారింది. ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన రామలింగారెడ్డి, తనకు కేటాయించిన జలవనరుల శాఖ పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ శుక్రవారం ఉదయం రాజీనామా చేశారు. గతంలో తనకు బెంగళూరు అభివృద్ధి శాఖను కేటాయిస్తానని డీకే శివకుమార్ హామీ ఇచ్చారని, కానీ ఇప్పుడు ఆ శాఖను కృష్ణ బైరేగౌడకు కేటాయించారని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై స్పందించిన సీఎం డీకే శివకుమార్, రామలింగారెడ్డికి హామీ ఇచ్చిన మాట వాస్తవమేనని అంగీకరించారు. "నేను నా వంతు ప్రయత్నం చేశాను, కానీ తుది నిర్ణయం అధిష్ఠానం తీసుకుంది. ఆయన నా మిత్రుడు, స్వయంగా వెళ్లి ఆయనతో మాట్లాడతాను" అని శివకుమార్ తెలిపారు. మరోవైపు, రామలింగారెడ్డి తన రాజీనామా లేఖపై బహిరంగంగానే సంతకం చేశారు. తనకు పదేపదే అవమానం జరుగుతోందని, ఆత్మసాక్షికి విరుద్ధంగా పనిచేయలేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, తాను పార్టీలోనే కొనసాగుతానని, కేవలం మంత్రి పదవికి మాత్రమే రాజీనామా చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ వివాదంలో కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుని ఆయనను బుజ్జగించే ప్రయత్నాలు చేస్తోందని, ఒకవేళ ఆయన మెత్తబడకపోతే రాజీనామాను ఆమోదించే దిశగా యోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ రాజకీయ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు పార్టీ అగ్రనేతలు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు.

## కేరళను ముంచెత్తుతున్న భారీ వర్షాలు..

జూన్ 4న కేరళను పలకరించిన నైరుతి రుతుపవనాలు ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చాయి. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఈ సీజన్‌లో తొలిసారిగా రెడ్ అలర్ట్ జారీ చేసింది. కేరళ ఉత్తర భాగంలోని ఐదు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న నివేదికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.శుక్రవారం ఉదయం కోజికోడ్ తదితర ప్రాంతాల్లో బలమైన ఈదురు గాలుల ధాటికి చెట్లు నేలకూలాయి. శనివారం మలప్పురం, కోజికోడ్, వయనాడ్, కన్నూర్, కాసర్‌గడ్ జిల్లాల్లో 24 గంటల వ్యవధిలో 20 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. మరికొన్ని జిల్లాలకు ఆదివారం కూడా ఈ హెచ్చరికలు వర్తిస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.మరోవైపు ఇడుక్కి, త్రిస్సూర్, ఎర్నాకుళం, కొట్టాయం, పాలక్కాడ్, పతనంతిట్ట జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, అలప్పుజ, కొల్లం, తిరువనంతపురం జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తూ, ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.
సాధారణ తేదీ కంటే ఆలస్యంగా రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ, వాటి తీవ్రత అధికంగా ఉండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు లేదా సహాయక శిబిరాలకు తరలివెళ్లాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. పర్యాటక ప్రాంతాలు, నదులు, కొండ ప్రాంతాలకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని హెచ్చరించింది.
అత్యవసర సహాయం కోసం 1077, 1070 హెల్ప్ లైన్ నంబర్లను సంప్రదించాలని కోరింది. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని, అధికారులు పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారని సమాచారం.

## ఏపీలో చిన్న న్యూక్లియర్ రియాక్టర్లు... రష్యా దిగ్గజం రోసాటమ్‌కు లోకేష్ ప్రతిపాదన

- మొదటి పేజి తరువాయి

తయారీ సంస్థ రుసాల్ ఉన్నత స్థాయి ప్రతినిధులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఏపీలో భారీ పెట్టుబడులు పెట్టాలని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరిశ్రమలు స్థాపించాలని వారిని ఆహ్వానించారు. మరోవైపు, గ్లోబల్ లాజిస్టిక్స్ సదస్సులో పాల్గొని, ఆర్కిటిక్ నూతన జలమార్గం ద్వారా ఏపీకి కలగనున్న ప్రయోజనాలను ప్రపంచానికి వివరించారు.

**రోసాటమ్‌తో భేటీ: ఏపీకి అణుశక్తి ఆధారిత పరిశ్రమలు**

రష్యాకు చెందిన గ్లోబల్ న్యూక్లియర్ టెక్నాలజీ లీడర్ రోసాటమ్ డైరెక్టర్ (ఐటీ ఢ డిజిటలైజేషన్) అబాకుమోవ్ ఎవ్ జెనీ, ఇంటర్నేషనల్ డైరెక్టర్ జనరల్ క్యాట్కోవ్స్కీ ఎగోర్‌తో మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో పెట్టుబడులకు గల అపార అవకాశాలను వివరిస్తూ పలు ప్రతిపాదనలు చేశారు. రాష్ట్రంలో ఉన్న సువిశాల తీరప్రాంతాన్ని ఉపయోగించుకొని, పారిశ్రామిక వాడలకు 24/7 నిరంతరాయంగా స్వచ్ఛమైన విద్యుత్‌ను అందించేందుకు స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు (ఎస్ఎంఆర్) ఏర్పాటు చేయాలని లోకేష్ ఆహ్వానించారు.
ఫార్మా, వ్యవసాయ ఎగుమతులను ప్రోత్సహించేందుకు వీలుగా న్యూక్లియర్ మెడిసిన్, ఫుడ్ ఇర్రాడియేషన్ సెంటర్‌ను స్థాపించాలని కోరారు. పారిశ్రామిక పార్కులలో నీటి కొరతను అధిగమించేందుకు న్యూక్లియర్ డీశాలినేషన్ ప్లాంట్‌ను నిర్మించాలని, అలాగే ఏరోస్పేస్, రక్షణ రంగాలకు అవసరమైన న్యూక్లియర్-గ్రేడ్ మిశ్రమ లోహాలు, కార్బన్-ఫైబర్ కాంపోజిట్‌ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.
మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై రోసాటమ్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. భారత్‌లో ఇప్పటికే న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐఎల్)తో కలిసి పనిచేస్తున్నామని, ప్రతిష్ఠాత్మక కూడంకుళం అణు విద్యుత్ ప్లాంట్‌కు సాంకేతిక సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఏపీలో పెట్టుబడులకు సంబంధించిన లోకేష్ ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

**ఆర్కిటిక్ మార్గంపై సదస్సు: ఏపీకి కొత్త వాణిజ్య ద్వారాలు**

అనంతరం, 'గ్లోబల్ లాజిస్టిక్స్ లో కొత్త అవకాశాలు -- ఆర్కిటిక్ లో లాజిస్టిక్స్ రూపురేఖలు' అనే అంశంపై జరిగిన సదస్సులో లోకేష్ ప్రసంగించారు. సంప్రదాయ సూయజ్ కాలువ మార్గంతో పోలిస్తే, ఆర్కిటిక్ ఉత్తర సముద్ర మార్గం ఆసియా-ఐరోపా మధ్య ప్రయాణ దూరాన్ని 40% తగ్గిస్తుందని, తద్వారా ఇంధనం, సమయం, ఖర్చులు ఆదా అవుతాయని వివరించారు. 1053 కి.మీ.ల సుదీర్ఘ తీరప్రాంతం, 6 కార్యాచరణ ఓడరేవులు, మరో 4 నిర్మాణంలో ఉన్న పోర్టులతో ఆంధ్రప్రదేశ్ ఈ కొత్త మార్గానికి సహజమైన దక్షిణ ప్రవేశ ద్వారంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు.చెన్నై-వ్లాడివోస్టాక్ సముద్ర కారిడార్ ద్వారా విశాఖపట్నం వంటి ఓడరేవులు ఇప్పటికే ఈ వ్యవస్థలో భాగమయ్యాయని గుర్తుచేశారు. ముఖ్యంగా రష్యా నుంచి ఎరువుల రవాణాకు ఈ మార్గం అత్యంత ప్రయోజనకరమని, వ్యవసాయ ఆధారిత ఏపీకి ఇది ఎంతో మేలు చేస్తుందని అన్నారు. ప్రస్తుతం ఈ మార్గం ఏడాదిలో కొన్ని నెలలే అందుబాటులో ఉన్నా, రష్యా తన ఐస్‌బ్రేకర్ నౌకాదళాన్ని విస్తరిస్తున్నందున త్వరలో ఏడాది పొడవునా రవాణా సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
ఎర్ర సముద్రంలో ఇటీవలి పరిణామాలు ఒకే వాణిజ్య మార్గంపై ఆధారపడటంలోని ప్రమాదాలను గుర్తుచేశాయని, అందుకే ఏపీ ఆర్కిటిక్ మార్గాన్ని అందిపుచ్చుకునేందుకు మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెడుతోందని లోకేష్ సదస్సుకు వివరించారు.

**రుసాల్‌తో చర్చలు: అల్యూమినియం రంగంలో పెట్టుబడులకు ఆహ్వానం**

మరో కీలక సమావేశంలో, ప్రపంచంలోని అతిపెద్ద అల్యూమినియం ఉత్పత్తిదారుల్లో ఒకటైన రుసాల్ (రుసాల్) సీనియర్ యాజమాన్యంతో మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. పునరుత్పాదక ఇంధనాన్ని వాడుకొని గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్, విశాఖపట్నం-చెన్నై కారిడార్‌లో ఆటోమోటివ్ ఢ ఏరోస్పేస్ అల్లాయ్ ప్లాంట్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి అవసరమైన అల్యూమినియం ఫాయిల్ తయారీ యూనిట్‌ను నెలకొల్పాలని లోకేష్ ప్రతిపాదించారు.



# కాలినడకన కలెక్టర్

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 05**

జిల్లా పరిపాలన అధికారిగా ఉన్న కలెక్టర్... పర్యావరణ పరిరక్షణలోనూ స్ఫూర్తిగా నిలిచారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవము సందర్భంగా ప్రకాశం భవనంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనేందుకు తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ పి. రాజాబాబు నడుచుకుంటూ వచ్చారు. ఆఫీసు, మార్కెట్, ఇతర పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు వారంలో కనీసం ఒకసారైనా ఈ విధంగా నడుచుకుంటూ, లేదా సైకిల్ తొక్కుకుంటూ వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. దీనివలన గణనీయమైన స్థాయిలో ఇంధనాన్ని ఆదా చేయడంతో పాటు పర్యావరణానికి ఎంతో మేలు చేసిన వారవుతామని కలెక్టర్ అన్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# మొక్కలు నాటడాన్ని అలవాటుగా మార్చుకోండి

### -ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించండి -పర్యావరణ దినోత్సవం రోజున పిలుపునిచ్చిన ఎమ్మెల్యే ఇంటూరి

### -కందుకూరులో సైకిల్ యాత్ర చేసిన ఎమ్మెల్యే, అధికారులు



**కందుకూరు పెన్ పవర్, జూన్ 5:**

ప్రతి ఒక్కరూ తమ వంతుగా మొక్కలు నాటడం అలవాటుగా చేసుకుని, పర్యావరణాన్ని కాపాడాలని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, కందుకూరు పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సైకిల్ యాత్రలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, మున్సిపల్ కమిషనర్ అనూష, ఇతర అధికారులు, కూటమి పార్టీల నేతలతో కలిసి మున్సిపల్ కార్యాలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు సైకిల్ తొక్కారు. వీలున్నంతవరకు మోటారు వాహనాల వినియోగం తగ్గించేందుకు ప్రయత్నించాలని ప్రజలకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం మొక్కలు నాటారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ చిన్నతనంలో పర్యావరణం సమతుల్యంగా ఉండి సకాలంలో వర్షాలు కురిసేవని గుర్తు చేసుకున్నారు. రానురాను ఉష్ణోగ్రతలు పెరిగిపోవడానికి, పచ్చదనం తగ్గిపోవటమే కారణమన్నారు. రకరకాల కారణాలతో చెట్లను విపరీతంగా కొట్టివేయడం వల్ల, మనకు మనమే నష్టం చేసుకుంటున్నామని ఎమ్మెల్యే అన్నారు. అలాగే ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగిందని, ఎక్కడచూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే శాపంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే నాగేశ్వరరావు చెబుతూ



మొక్కలు ఎక్కువగా నాటాలని పిలుపునిచ్చారు. అలాగే వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కోరారు. కేవలం పర్యావరణ దినోత్సవం రోజున మాత్రమే కాకుండా, మిగిలిన రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తిని పాటించాలన్నారు. అటు పర్యావరణం, ఇటు పొదుపు చర్యల్లో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వం అనేక జాగ్రత్తలు తీసుకుంటుందని ఎమ్మెల్యే చెప్పారు. ప్రభుత్వ పెద్దలు, మంత్రులు, అధికారులు కూడా వాహనాలను పరిమితంగా ఉపయోగిస్తూ ప్రజలకు మంచి సందేశాన్ని ఇస్తున్నారని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ హిమవంశీ మాట్లాడుతూ ప్రస్తుతం నమోదవుతున్న ఉష్ణోగ్రతలకు అందరూ ఇబ్బందులు పడడం చూస్తున్నామని, ఏడాదికేడాది అవి పెరుగుతూనే ఉన్నాయన్నారు. వాటి నుంచి ఉపశమనం పొందడానికి కొత్తగా మొక్కలు నాటడంతో పాటు, ఉన్న చెట్లను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రత్యేక దృష్టి పెట్టామని మున్సిపల్ కమిషనర్ అనూష తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, రూరల్ అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీను, తెలుగు రైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, అన్న క్యాంటీన్ చైర్మన్ కొండలరావు, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కల్లూరి శైలజ, నియోజవర్గ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక, అశ్విని సుధారాణి, పార్టీ నాయకులు రెబ్బవరపు మాల్యాద్రి, చుండూరి శ్రీను, వడ్డెళ్ళ రవిచంద్ర, గొంది నరసింగరావు, మెండా లెనిన్, కోటపూరి శ్రీను, భవనాసి వెంకటేశ్వర్లు, ముప్పవరపు వేణు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






## పర్యావరణ పరిరక్షణలో

# భాగస్వాములు కావాలి

### ప్రజలకు జిల్లా కలెక్టర్ పిలుపు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 05**

పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రకాశం భవనంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యత నిర్వహిస్తామంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ పై కలెక్టర్ సంతకం చేశారు. అనంతరం ప్రకాశం భవనం నుంచి మినీ స్టేడియం వరకు అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. అవకాశం ఉన్నంతవరకు నడక, ప్రజా రవాణా వ్యవస్థ, కలిసి ఒకే వాహనంలో ప్రయాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ ను వినియోగించవద్దని, కర్బన ఉద్గారాలను తగ్గించడానికి ప్రజలందరూ కృషి చేయాలని కలెక్టర్ చెప్పారు. మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గురుకుల పాఠశాలలు, కాలేజీలలో అనంత అరణ్య పేరుతో వనాల పెంపకాన్ని ప్రారంభించింది అన్నారు. మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతోపాటు భావి తరాలకు కూడా ఆరోగ్యకర వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.






ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డిఆర్ఓ మాధురి, డీఎఫ్ఓ వినోద్ కుమార్, కాలుష్య నియంత్రణ మండలి ఈ.ఈ. విజయ్ మోహన్, ఒంగోలు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రామ్ భూపాల్ రెడ్డి, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, ఇతర అధికారులు, వావ్, ఐ.టీ.సీ., సార్డ్స్ స్వచ్ఛంద సంస్థలు, భగీరథ కెమికల్స్, మున్నంగి సీ ఫుడ్స్, జెసి బయోటిక్స్ పరిశ్రమల ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలి

### - ఏపీ ఎస్ హెచ్ సి ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పి.అరుణ్ బాబు



**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 05**

గృహాల నిర్మాణంలో నిర్ణీత లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని, పనుల పురోగతిని వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఏపీ ఎస్ హెచ్ సి ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పి.అరుణ్ బాబు పలు సూచనలు చేశారు. శుక్రవారం ఒంగోలులోని జిల్లా హౌసింగ్ కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ పి.అరుణ్ బాబు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.సమావేశంలో గృహ నిర్మాణ లక్ష్యాలు, సాధించిన పురోగతి, పీపీపీ, పీఎంఏవై-యు 2.0 కార్యక్రమాల అమలు పురోగతిపై విపులంగా సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాలో బేస్మెంట్ స్థాయిలో 4,814 ఇళ్లు, లింటెల్ స్థాయిలో 716 ఇళ్లు, రూఫ్ స్థాయిలో 1,333 ఇళ్లు --- మొత్తం 6,863 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నట్లు వివరించారు. ఈ ఇళ్లన్నింటిని సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, ఆగస్టు 2026 నెలాఖరులోగా పూర్తి చేయవలసిన 3,997 ఇళ్లను జిల్లా లక్ష్యంగా నిర్దేశించినందున, వాటిని కూడా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే గృహ నిర్మాణ కార్యక్రమాల అమలులో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ, లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రకాశం జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ పెరుగు శ్రీనివాస ప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.



# కొమరోలు లో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసిన దాతలకు కృతజ్ఞతలు అభినందనలు

### సత్య సాయి సేవ సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి విద్య శిబిరాన్ని ప్రారంభించిన గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల

కొమరోలు పెన్ పవర్ జూన్ 5

కొమరోలు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి అనేకమంది పేద నిరుపేదలకు సౌకర్యం కల్పించిన దాతలు లకు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. సత్య సాయి సేవ సంస్థ ఆధ్వర్యంలో చెన్నై ఐఐటి శంకర నేత్రాలయ నిర్వహకులు కొమరోలులో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్షలు చాలా శిబిరానికి శుక్రవారం గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరయ్యేందుకు కొమరోలు చేరుకున్న శాసనసభ్యులు ముత్తుముల అశోక రెడ్డికి పలువురు కూటమి పార్టీల నేతలు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన సరస్వతీదేవి విగ్రహానికి పూలమాలవేసి ప్రార్థించారు. అనంతరం ఏర్పాటు చేసిన వైద్య శిబిరం ప్రారంభోత్సవకార్యక్రమానికి అధ్యక్షత వహించిన రామిరెడ్డి మాట్లాడుతూ ,నెల్లూరు జిల్లాకు చెందిన కాటంరెడ్డి ప్రసాద్ రెడ్డి ఆయన సతీమణి శోభ రాష్ట్రంలో సత్య సాయి సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాలు నిర్వహించేందుకు రెండున్నర కోట్ల రూపాయల విరాళం అందజేశారని, తెలిపారు .ఆ నిధులతో నెల్లూరు జిల్లాలో ఐదు శిబిరాలు ,ప్రకాశం జిల్లాలో రెండు, కర్నూలు జిల్లాలు రెండు ,అనంతపురం జిల్లాలో ఒకటి శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారని, దీనితో వేలాది మంది రోగులకు కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సలు చేసి పేద నిరుపేదలకు ఎంతో సౌకర్యం కల్పిస్తున్నారని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన కొమరోలు మండలంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని అంటూ ఆర్థికంగా సహకరించిన దాతలు కాటంరెడ్డి ప్రసాద్ రెడ్డి శోభ దంపతులకు, సత్య సాయి సేవ సంస్థ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు సత్య సాయి బాబాకు తామంతా భక్తులమని, తమ తాత తండ్రుల కాలం నుంచి కూడా కుటుంబ సమేతంగా తామంతా బాబా భక్తులుగా మారి స్వామి వారి కృపకు పాత్రులమవుతున్నామని పేర్కొన్నారు .తాను తన సోదరుడు పుట్టపర్తి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాసంస్థలలోనే చదువుకున్నామని ఆయన గుర్తు చేశారు. ధాతృత్వం సేవాగుణం గల దాతలు ఉన్నప్పుడే పేద నిరుపేదలకు ఎంతో సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి తన వంతుగా పూర్తి సహాయకారాలు అందిస్తామని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పేర్కొన్నారు. వైద్య శిబిరం కు తరలివచ్చిన వారిలో 150 మందికి మొదటిరోజు వైద్య పరీక్షలు నిర్వహించామని, ఈ నెల 9వ తేదీ వరకు వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం 13వ తేదీ వరకు శస్త్ర చికిత్సలు అవసరమైన రోగులకు శంకర నేత్రాలయ కు చెందిన ఏసి వాహనాలలో కొమరోలు లోనే శస్త్రచికిత్సలు చేసి ఒక గంట తర్వాత రోగులను పంపిస్తామని నిర్వాహకులు తెలిపారు .ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో, గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి, ఎడమ కళ్ళు సహకార సంఘం అధ్యక్షులు బిజ్జం రవీంద్రారెడ్డి, కొమరోలు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్, గిద్దలూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ షేక్ హసీనా,, తిరుమలరెడ్డి ,తాసిల్దార్ భాగ్యలక్ష్మి, తెలుగుదేశం పార్టీ నేతలు వీరం రెడ్డి శంకర్ రెడ్డి, శివారెడ్డి కొమరోలు మండలం తో పాటు మార్కాపురం డివిజన్లోని సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధుల తోపాటు పలువురు తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# 9వ తేదీ వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన



**కందుకూరు పెన్ పవర్ జూన్ 5:**

ఈనెల 9వ తేదీన పెరిగిన ధరలను తగ్గించాలని వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం కార్యాలయంలో సిపిఐ, సిపిఎం నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు, సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్ఐ గౌస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత ఎన్నికలకు ముందు అమెరికా ఇరాన్ యుద్ధాల సమయంలో ఎటువంటి ధరలు పెంచబోమని ఎలక్షన్ అయిపోయిన వెంటనే గ్యాస్ ధరలు, పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి పేద ప్రజలపై అధిక మోపిందని, గత గత నెలలో నాలుగు సార్లు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం నిత్యవసర వస్తువుల పై ప్రభావం పడే పరిస్థితి ఉందని వారు అన్నారు. నాన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ జూన్ 9వ తేదీన వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నామని వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ సహాయక కార్యదర్శి పి బాలకోటయ్య, సిపిఐ నాయకులు ఉప్పుటూరి మాధవరావు, సిపిఎం నాయకులు మాలకొండ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ నేత పాలస్ వర్ధంతి సభను జయప్రదం చేయండి




**కందుకూరు పెన్ పవర్, జూన్ 5**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఎర్ర జెండా ముద్దుబిడ్డ, శ్రామిక కూలి, దళిత బహుజన గిరిజన బలహీన వర్గాల సాధన కోసం వారి పక్షాన నిలబడి తుది శ్వాస వరకు నమ్ముకున్న కమ్యూనిజం సిద్ధాంతంలో ఎర్రజెండాను ముద్దాడి అమరుడైన కమ్యూనిస్టు యోధుడు సుదర్శి పాలస్ 11వ వర్ధంతి కార్యక్రమం ఈనెల 6 శనివారం ఉదయం 10 గంటలకు కందుకూరు సిపిఐ కార్యాలయంలో జరుగుతుందని సిపిఐ కార్యదర్శి బి సురేష్ బాబు, సహాయ కార్యదర్శి పి బాలకోటయ్య సీనియర్ నాయకులు ఉప్పుటూరి మాధవరావులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కందుకూరు ప్రాంతంతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో జరిగిన ఏ ఉద్యమంలోనైనా పాలస్ తనదైన ముద్రవేశారని అన్నారు. ఆరు దశాబ్దాల క్రిందటే ఉన్నత విద్య అభ్యసించి ప్రజల కోసం ఉన్నత ఉద్యోగాలను వదిలి ఉద్యమ బాట పట్టిన పోరాట యోధుడు పాలస్ అని అన్నారు. బలహీన వర్గాల సమస్యల పరిష్కారం పెత్తందారుల ఆగడాలను అరికట్టాలన్న లక్ష్యంతో భావజాలంతో తుదిశ్వాస వరకు పోరాడిన వ్యక్తి పాలస్ అని వారు అన్నారు. అలాంటి కమ్యూనిస్టు యోధుని వర్ధంతి సభకు కార్మికులు శ్రామికులు, మేధావులు దళిత బహుజన గిరిజన బలహీన వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు

# తల్లి పేరున ఒక మొక్క నాటండి

-ఘట్టమనేని హరిబాబు



**కందుకూరు పెన్ పవర్, జూన్ 5**

ప్రపంచపర్యావరణ దినోత్సవ సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు "ఏక్ పేడ్ మాకేనామ్ "(తల్లిపేరున ఒక మొక్క)కార్యక్రమం పేరున స్థానిక గ్రామదేవత శ్రీ అంకమ్మ తల్లి దేవస్థానం ప్రాంగణం లో దేవతా వృక్ష మయిన శమీ (జమ్మి )ఫల వృక్షమొక్కలయిన నేరేడు, ఉసిరి మొక్కలను బిజెపి ఆధ్వర్యంలో నాటారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జ్ ఘట్టమనేని హరిబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తల్లి పేరు మీద ఒక మొక్క నాటి ప్రకృతిని పరిరక్షించాలని కోరారు. వాతావరణ సమతుల్యత కోసం మొక్కలు నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జొన్నాదుల రాఘవయ్య, పట్టణశాఖ అధ్యక్షులు చుండి మురళీధర్, ప్రధాన కార్యదర్శులు మాటూరి రమేష్ నాయుడు, రావి సరిత, సీనియర్ నాయకులు ముప్పల భూషయ్య, అమలనాధుని మాల్యాద్రినాయుడు, మన్నేపల్లి వరప్రసాదరావు, జి. మోజెస్, చల్లా వెంకటరాజా తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు ముందుకు రావాలి

## -ప్రకాశం కరస్పాండెంట్ డా. కె. విజయ్ శ్రీనివాస్

**కందుకూరు, పెన్ పవర్ జూన్ 5**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ముఖ్యంగా యువత విద్యార్థులు ఈ విషయంలో ముందుండి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ డా. కంచర్ల విజయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కందుకూరులోని ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగం ఆధ్వర్యంలో ప్రథమ సంవత్సరం బీటెక్ విద్యార్థులతో కలిసి మొక్కల నాటడం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. విజయ్ శ్రీనివాస్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించి పర్యావరణ హిత జీవన విధానాలను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులందరితో పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని, మొక్కలను సంరక్షిస్తామని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.ప్రతి విద్యార్థి తమ ఇంటి వద్ద లేదా గ్రామంలో కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించి పెద్ద చెట్టుగా పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఇంజినీరింగ్ విద్యార్థులు తమ సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలను పర్యావరణ పరిరక్షణకు వినియోగించి భవిష్యత్ తరాలకు పచ్చని ప్రపంచాన్ని అందించేందుకు కృషి చేయాలని



కోరారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. చదలవాడ రవి కుమార్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్రకృతి పరిరక్షణపై అవగాహన పెంపొందించే గొప్ప వేదిక అని అన్నారు. ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు సామాజిక బాధ్యత, పర్యావరణ చైతన్యం నాయకత్వ లక్షణాలను పెంపొందించే దిశగా నిరంతరం కృషి చేస్తోందన్నారు. పర్యావరణ



పరిరక్షణలో యువత పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్ హెచ్ విభాగాధిపతి డా. సూరియా షిహాబ్, అధ్యాపకులు డా. శైలేష్, డా. రామ్ ప్రసాద్, బాల బ్రహ్మచారి, ఆశా జ్యోతి, సులోచన, శ్రీదేవి, సుధారాణి, శైలజ, నరేష్, మైమూన్నిసా తదితర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటారు. కళాశాల ప్రాంగణాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని సంకల్పించారు. ఈ రోజు ఒక మొక్కను నాటండి... రేపటి తరాలకు పచ్చని భవిష్యత్తును అందించండి" అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది.

# పర్యావరణసమతుల్యత లోపిస్తే వాతావరణంలో మార్పులు వస్తాయి

## భవిష్యత్ కు పచ్చదనాన్ని అందిద్దాం

## అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కె. భరత్ చంద్ర



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 5**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గిద్దలూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో , కోర్టుల ప్రాంగణం నందు పర్యావరణ పరిరక్షణపై మొక్కలు నాటే కార్యక్రమంను గిద్దలూరు ఒకటవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కె. భరత్ చంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు .ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం, జనాభా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య పర్యావరణ పరిరక్షణ అని తెలియజేశారు. పర్యావరణ సమతుల్యత లోపించినపుడు విపరీతమైన ఎండలు, వానలు, భూకంపాలు వస్తాయని అందువలన, ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, కావున ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడమే కాక, వాటిని పరిరక్షించాలని, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ వాడకమును పూర్తిగా మానివేయాలని హితవు పలికారు .మొక్కలు నాటడం ద్వారా ఎక్కువ ఆక్సిజన్ ను పొందగలుగుతామని తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో సహాయం చేస్తాయని, సకాలంలో వానలు పడతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిఎన్ .శేషశయనారెడ్డి, ఉపాధ్యక్షులు ఎ. తిరుమల ప్రసాద్,ప్రధాన కార్యదర్శి బి.ఐజాక్ ,కోశాధికారి ఎస్.కె.ఫాజిల్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్ అద్దంకి. మధుసూధనరావు పాల్గొన్నారు.

# అదుపుతప్పి గోతిలో పడ్డ బైక్

## బాదినేని పల్లె పంచాయతీ టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎర్రి మధు మృతి.



**కొమరోలు పెన్ పవర్ జూన్ 5**

కొమరోలు మండలం బాధినేనిపల్లి సమీపంలో గురువారం రాత్రి బైక్ అదుపుతప్పి రోడ్డు మార్జిన్లో ఉన్న గోతిలో పడ్డ ప్రమాదంలో బాదినేని పల్లె పంచాయితీ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎర్రి మధు అనే యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఎర్రి మధు తెలుగుదేశం పార్టీలో చురుకైన, కీలక కార్యకర్తగా, బాదినేనిపల్లి పంచాయితీ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. తన ఐదు రోజుల వయసు గల కుమారుడు అనారోగ్యంగా ఉన్నాడని తెలిసి గురువారం ఉదయం అత్తగారు ఊరైన కడప జిల్లా ఎర్రగుంట్ల సమీపంలోని కలగళ్ల గ్రామానికి వెళ్లి రాత్రి తన బైక్ పై కొమరోలు తిరిగి ఇంటికి వెళుతుండగా బాదినేనిపల్లి సమీపంలోని కొత్త వంతెన వద్ద గల మలుపులో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గోతిలో పడింది. ఆ ప్రమాదంలో ఎర్రి మధు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎర్రి మధుకు తండ్రి చిన్నతనంలోనే మరణించగా, గత ఏడాది మధుకు వివాహం జరిగింది. గత ఐదు రోజుల క్రితం మధు దంపతులకు కుమారుడు జన్మించాడు .ఆ సంతోషంలో ఉన్న కుటుంబం మధు మృతితో దుఃఖసాగరంలో మునిగిపోయింది. మధు మృతి చెందిన సమాచారం అందుకున్న బాధనేని



పల్లె యూనిట్ ఇన్చార్జి ముత్తుముల ఎల్లారెడ్డి మధు ఇంటికి వెళ్లి మధు మృతి పట్ల తీవ్ర సంతాపర వ్యక్తం చేసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. పార్టీ కార్యక్రమాలలో తన కుడి భుజంగా పనిచేస్తూ ఎంతో సహకరించే వాడని, అలాంటి మధు మృతి చెందడం చాలా బాధాకరమని ఎల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు .కాగా ఎల్లారెడ్డి సమాచారాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులకు తెలియజేయడంతో, శుక్రవారం కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి, ఇడమ కళ్ళు సహకార సంఘం అధ్యక్షులు బిజ్జం రవీంద్రారెడ్డి, కొమరోలు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ తదితరులు బాధినేనిపల్లి గ్రామానికి వెళ్లి మధు మృతదేహంపై పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. మధు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తూ తెలుగుదేశం పార్టీ చురుకైన కార్యకర్తలు కోల్పోయిందని, మధు కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని ముత్తుముల సంజీవరెడ్డి పేర్కొన్నారు.

# నూతన ఎంపీడీవోను మర్యాదపూర్వకంగా కలసిన నేత్రపురి శ్రీరామ సేవక్ సభ్యులు

**గుడ్లూరు, పెన్ పవర్, జూన్ 05**

గుడ్లూరు మండల నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన మల్లికార్జునరావును నేత్రపురి శ్రీరామ సేపక్ సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు తమను తాము పరిచయం చేసుకొని గుడ్లూరులో శ్రీరామ సేవక్ ద్వారా చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాల గురించి వివరించి, తదుపరి మేము చేయబోయే సేవా కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా తప్పక హాజరుకావాలని ఎంపీడీవోను కోరారు. ఆహ్వానం అందిన వెంటనే తప్పకుండా విచ్చేస్తానని ఎంపీడీఓ వారికి తెలిపారు. తదనంతరం నేత్రపురి శ్రీరామసేవక్ సభ్యులు ఎంపీడీవో మల్లికార్జున రావును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేత్రపురి శ్రీరామసేవక్ నిర్వాహకులు ఎయిర్టెల్ చిన్న, గుడ్లురు మండల ఆర్యవైశ్య ఫెడరేషన్ నూతన అధ్యక్షుడు ఇన్నమూరి సుధాకర్, ఆర్యవైశ్య పెద్దలు ఇన్నమూరి గరటయ్య, గుర్రం బాబు, ఆర్యవైశ్య యూత్ గొల్ల




అచ్యుత మణికంఠ, పూజిత మెడికల్స్ మనోహర్, గుడ్లూరు మండల బిజెపి అధ్యక్షులు జలగం వరుణ్ కుమార్, తెలుగు యువత చెన్నారెడ్డి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణం మనజీవనాదరం

## వనవిహారంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే ముత్తుముల

## ఒక్కొక్కరు ఒక మొక్క నాటితే భవిష్యత్తుకు మంచి పర్యావరణాన్ని మంచి వాతావరణం అందించగలం





**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 5**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దిగువమెట్ట వనవిహారంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మొక్కలు నాటారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ సమతుల్యతను కాపాడ డంలో చెట్ల ప్రాముఖ్యత ఎంతో ఉందని, పచ్చదనం పెంపొందించడం ద్వారా వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వనవిహారం లోని (పొగడ) అను ఒక మొక్కకు ఎమ్మెల్యే తల్లి అయిన " ముత్తుముల లక్ష్మీదేవమ్మ " అని నామకరణం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు స్థానిక ప్రజలు పాల్గొని మొక్కలు నాటారు.

# బాలురు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## పంచాయతీ అధికారి బివి నాయుడు

**పొదిలి, పెన్ పవర్, జూన్ 5**

బాలురు బాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని గ్రామ పంచాయతీ అధికారి బివి నాయుడు చెప్పారు. శుక్రవారం నాడు మండల కేంద్రమైన మర్రిపూడి సచివాలయంలో కిశోర వికాస శారీరక మానసిక మార్పులపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న పంచాయతీ అధికారి బివి నాయుడు మాట్లాడుతూ యుక్త వయస్సులో యువకులు ఎటువంటి చెడు వ్యసనాలకు ఆకర్షితులు అయినా, వారి బంగారు భవిష్యత్తు అంధకారం అవుతుందని హెచ్చరించారు. వి ఆర్ ఓ బడే సాహెబ్ మాట్లాడుతూ యువకులు క్రీడలు, సృజనాత్మక రంగాలపై దృష్టి సారించాలని సూచించారు. అంగ న్ వాడి కార్యకర్త కె.పి హైమావతి మాట్లాడుతూ జీవనానికి పాటించాల్సిన పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్ నరసారెడ్డి, మహిళా పోలీస్ కృష్ణవేణి, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రతాపరెడ్డి, అంగన్వాడి కార్యకర్తలు హైమావతి, కామేశ్వరి, సచివాలయ సిబ్బంది, కిశోర బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రకృతిని కాపాడాలి ఆరోగ్యకరమైన ప్రపంచ నిర్మాణానికి నడుం కట్టాలి

## సివిల్ జడ్జి డాక్టర్ వి. లీలా శ్యాంసుందరి పిలుపు





**సింగరాయకొండ, జరుగుమల్లి జూన్ 5, పెన్ పవర్**

ప్రకృతిని కాపాడడం, ఆరోగ్యకరమైన ప్రపంచ నిర్మాణానికి నడుం కట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సింగరాయకొండ సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ వి.లీలా శ్యాం సుందరి పిలుపు ఇచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సింగరాయకొండ కోర్టు ప్రాంగణం లో బార్ అసోసియేషన్ న్యాయవాదుల సహకారం తో కోర్టు ప్రాంగణం లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు మనం ఒక మొక్క నేడు,రేపు ఆరోగ్యకరమైన ప్రపంచం అనే పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని హితవు చెప్పారు. పెరుగుతున్న కాలుష్యం, వస్తున్న వాతావరణ మార్పులు మరియు ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. చెట్లు మనకు ప్రాణవాయువును అందించడమే కాకుండా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందిస్తాయన్నారు. ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యతను స్వీకరించాలని ఆమె పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా కోర్టు ప్రాంగణాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. చెట్ల పెంపకం ద్వారా ప్రకృతి సమతుల్యతను కాపాడటంతో పాటు స్వచ్ఛమైన వాతావరణాన్ని భవిష్యత్ తరాలకు అందించవచ్చని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో న్యాయవాదులు ఎల్లప్పుడూ ముందుంటారని తెలిపారు. అనంతరం న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కలిసి వివిధ రకాల మొక్కలను నాటారు. మొక్కల పెంపకం మాత్రమే కాకుండా వాటి సంరక్షణ కూడా అంతే ముఖ్యమని పేర్కొంటూ, నాటిన ప్రతి మొక్కను పరిరక్షించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కోర్టు ప్రాంగణం పచ్చదనంతో కళకళలాడాలని, పర్యావరణ పరిరక్షణపై సమాజంలో మరింత అవగాహన పెంపొందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి బక్కమంతల వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాదులు కొల్లూరి వెంకట నరసింహారావు, రాఘవేంద్ర, సంజీవరెడ్డి, శ్రీనివాసులు, పంతగాని వెంకటేశ్వర్లు, వంశీ, రియాజ్, మహిళా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది మరియు బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడుకోవాలి

## ఎంపిడిఓ సీతారామరావు



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 5**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు, వెల్లుపల్లి గ్రామ పంచాయతీ లో జరిగిన ప్రత్యేక గ్రామసభ నందు పాల్గొని పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఖాళీ ప్రదేశములలో ఇంటి ఆవరణలో మొక్కలు నాటి వాటిని పెంచాలని మండల పరిషత్ అభివృధి అధికారి, పంచాయతీ ప్రత్యేక అధికారి కె సీతా రామారావు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో కార్యాలయపు పర్యవేక్షణ అధికారి డి. విజయ కార్యాలయ సిబ్బంది ఉపాధి హామీ పథకం సిబ్బంది పంచాయతీ అభివృద్ధి అధికారి టి విజయశాంతి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## రాష్ట్ర బిజెపి మహిళా నేత విజయలక్ష్మి





**పొదిలి, పెన్ పవర్, జూన్ 5**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా రాష్ట్ర బిజెపి మహిళా మోర్చా కార్యదర్శి బెల్లంకొండ విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పొదిలి మున్సిపాలిటీ పరిధిలోని కంబాలపాడు గ్రామంలో శుక్రవారం నాడు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విజయలక్ష్మి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం పాటించాల్సిన పద్ధతులను, ఆచరించాల్సిన కార్యక్రమాలను వివరించారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ ఒక చెట్టును నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ద్వారా ప్రపంచాన్ని కాలుష్య భూతం నుండి కాపాడాలని ఆమె కోరారు. అనంతరం విజయలక్ష్మి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నూతక్కి నాగేశ్వరరావు, రమణారెడ్డి, సీనియర్ బిజెపి నాయకులు మాగులూరి రామయ్య, శ్రీనివాసరెడ్డి, సయ్యద్ ఖాదర్ భాష తో పాటు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పొదుపు సంఘాలు లావాదేవీలను పారదర్శకంగా నిర్వహించాలి

## అట్లూరి రామకృష్ణంరాజు



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 5**

పొదుపు సంఘంలోని సభ్యులందరికీ ఆర్థిక లావాదేవీల పై సంపూర్ణ అవగాహన కలిగి పారదర్శకంగా నిర్వహించి ఐక్యమత్యంతో పని చేస్తే ఆర్థికాభివృద్ధి సాధ్యమని టిడిపి సీనియర్ నాయకులు అట్లూరి రామకృష్ణంరాజు అన్నారు మండలంలోని పెద్దరాజుపాలెం గ్రామంలో శుక్రవారం "మన డబ్బులు మన లెక్కలు" కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు అవగాహన ర్యాలీని నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పొదుపు, ఆర్థిక క్రమశిక్షణ, సంఘాల లావాదేవీల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాల లీడర్లు మాట్లాడుతూ మన డబ్బులు - మన లెక్కలు కార్యక్రమం ఉద్దేశ్యాలను వివరించి, సంఘాల ఆదాయ-వ్యయాల నమోదు, పొదుపు అలవాట్లు, రుణాల వినియోగంపై సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ సీనియర్ నాయకులు అట్లూరి రామకృష్ణంరాజు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు ఐకమత్యంగా పనిచేస్తూ తమ సమస్యలను పరస్పరం చర్చించుకొని పరిష్కరించుకోవాలని సూచించారు. పొదుపు సంఘాల లోని ప్రతి సభ్యురాలు తీసుకున్న రుణం చెల్లించిన వాయిదాలు బకాయి వివరాలు ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాలని లావాదేవీలను పారదర్శకంగా, సక్రమంగా నిర్వహించడం ద్వారా మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతారని అన్నారు మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు ప్రాధాన్యం కల్పించారని , మహిళలు పొదుపు ద్వారా అభివృద్ధి సాధించి కుటుంబ ఆర్థికస్థితిని మెరుగుపర్చు కోవడంలో పొదుపు సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షురాలు అట్లూరి సుబ్బలక్ష్మమ్మ, పొదుపు సంఘం లీడర్ అట్లూరి వరలక్ష్మి, అంగన్వాడి టీచర్ అట్లూరి రేఖా రాణి , యానిమేటర్ రామిశెట్టి రాధమ్మ.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

## గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ ఈ.వి. రమణబాబు

### పురపాలక సంఘం కార్యాలయంలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

### సిబ్బందితో కలిసి మొక్కలు నాటిన కమిషనర్



**గిద్దలూరు పెన్ పవర్, జూన్ 5:**

గిద్దలూరు పురపాలక సంఘం కార్యాలయంలో శుక్రవారం 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఈ.వి. రమణబాబు కార్యాలయ సిబ్బందితో కలిసి ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం కమిషనర్ ఈ.వి. రమణబాబు మాట్లాడుతూ, పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి సామాజిక బాధ్యత అని గుర్తుచేశారు. "రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టి, రాబోయే తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే పచ్చదనాన్ని పెంపొందించడం అత్యంత ఆవశ్యకం. ప్రతి పౌరుడూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి. అలాగే పరిసరాల పరిశుభ్రతలో భాగంగా ప్రతి ఇంటా తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలి," అని ఆయన పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపుదల కేవలం ప్రభుత్వ అధికారుల విధి మాత్రమే కాదని, ప్రతి పౌరుడూ ఇందులో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం సిబ్బంది, పారిశుద్ధ్య విభాగానికి చెందిన అధికారులు చురుగ్గా పాల్గొన్నారు.

# పర్యావరణ హితం కోసం మొక్కలు నాటాలి

## - ఆంధ్ర ప్రదేశ్ హిందూ పరిరక్షణ ట్రస్ట్ చైర్మన్ దాసరి శ్రీనివాసులు



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూన్ 05**

పర్యావరణహితం కోసం ప్రజలందరూ మొక్కలు నాటి కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఆంధ్ర ప్రదేశ్ హిందూ పరిరక్షణ ట్రస్ట్ చైర్మన్ దాసరి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఒంగోలు మండలం ఉలిచి గ్రామంలో తారకరామా ఎత్తిపోతల పథకం ఆవరణలో హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్, గుండ్లకమ్మ సామాజిక సాహిత్య సేవా సమాఖ్య ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూర్వ ప్రకాశం జిల్లా కలెక్టర్ ఆంధ్ర ప్రదేశ్ హిందూ పరిరక్షణ ట్రస్ట్ చైర్మన్ దాసరి శ్రీనివాసులు పాల్గొన్నారు. మొదటిగా గ్రామంలో నూతనంగా ప్రతిష్టించిన శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద పూజలు చేశారు. అనంతరం ఈ సందర్భంగా దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ రోజున గుండ్లకమ్మ గుండ్లకమ్మ నది పుట్టిన గుండ్ల బ్రహ్మేశ్వరం నుంచి గుండాయపాలెం వరకు ఉన్న ఏడు నియోజకవర్గాలలో మొక్కలు నాటడం జరిగిందని అందులో భాగంగా ఒంగోలు నియోజకవర్గంలోని ఉలిచి గ్రామంలో ఈ కార్యక్రమం చేపట్టామని చెప్పారు. సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ ఉలిచి గ్రామస్తులు ఐక్యంగా ఉండి సమాజ అభివృద్ధి కార్యక్రమాలలో ముందుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు చుంచు చలమయ్య, గుండ్లకమ్మ సామాజిక సాహిత్య సేవా సమాఖ్య అధ్యక్షుడు మండవ సుబ్బారావు, పి. సుధాకర్, చుంచు సింగయ్య, చుంచు రామాంజనేయులు, చుంచు వాసుబాబు, ఎర్రంనేని వెంకట శేషయ్య, ఎర్రంనేని నరసింహారావు మండవ సత్యనారాయణ,పోకూరి వెంకటేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు పిల్లల మానసిక అభివృద్ధిని అర్థం చేసుకోవాలి





అర్ధవీడు, వెన్ పవర్, జూన్ 5

తల్లిదండ్రులు పిల్లల మానసిక అభివృద్ధిని అర్థం చేసుకోవాలని సిడిపిఓ కే కుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని నాగులవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు నవ చైతన్య శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం నందు ఏఐ ఎనేబుల్ ఈ సి డి స్క్రీనింగ్ ప్రోగ్రాం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొబైల్ నందు నవచేతన అనే యాప్ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. యాప్ గురించి 0- 6 నెలల పిల్లలు ఎలా ఉండాలి అనే వివరాలు పొందుపరిచారన్నారు. ప్రేమ, మాట్లాడడం, ఆటలాడడం అనే మూడు అంశాల మీద ఇందులో వివరించడం జరిగిందన్నారు. పిల్లల మానసిక అభివృద్ధి గురించి తెలియజేశారు. ఇందులో తొమ్మిది అంశాల గురించి వివరించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ డి రమీజాభి మాట్లాడుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మంచి ఆరోగ్యము, తగిన పోషణ, బాల్య ఆరంభ దశ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాలుష్య నియంత్రణ తోటే పర్యావరణ సమతుల్యత

## - పి డి సి సి బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య

## - ఒంగోలు నియోజకవర్గ టిడిపి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 05**

ప్రతి ఒక్కరూ తమ ధైర్యం దిన కార్యక్రమాల్లో వారంలో ఒక్కరోజు మోటారు వాహనాలను పక్కనపెట్టి సైకిల్ లేదా నడకను ఉపయోగిస్తే వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించి పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు సైకిల్ యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పిడిసిసి బ్యాంక్ చైర్మన్ సీతారామయ్య మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంలో ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో లేదా కార్యాలయాల్లో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అవకాశం ఉన్నంత మేరకు నడక ప్రచారం వ్యవస్థ కలిసి ఒకే వాహనాలు ప్రాణానికి ప్రార్థన ఇవ్వాలని ఆయన కోరారు. ప్లాస్టిక్ ని వినియోగించవద్దని ప్రజలకు సూచించారు. ఒంగోలు నగర టిడిపి అధ్యక్షులు బండారు మదన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తుందని అందులో భాగంగా కాలుష్య నియంత్రణ కోసం సైకిల్ యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. పాఠశాలల్లో కాలేజీల్లో కార్యాలయాల్లో ఇంటి ఆవరణలో తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే మహోద్యమాన్ని చేపట్టాలని మదన్ కోరారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాచగర్ల వెంకటరావు, టిడిపి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కొమ్మూరి రవిచంద్ర, నగర ప్రధాన కార్యదర్శి బొడ్డపాటి వెంకట్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమంను విజయవంతం చేయాలి -బొబ్బూరి రమేష్

**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 5**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం టిడిపి కార్యాలయంలో శుక్రవారం కనిగిరి శాసనసభ్యులు ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ అధ్యక్షతన కనిగిరిలో జరగనున్న భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం గురించి టిడిపి నాయకులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా బొబ్బూరి రమేష్ మాట్లాడుతూ అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. నేడు కనిగిరిలో నిర్వహించనున్న అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి మండలంలోని 23 గ్రామపంచాయతీల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, దాసరి మల్లికార్జున, మైనార్టీ సెల్ అధ్యక్షులు కూటగుళ్ల మహబూబ్ బాషా , మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు యేసు రత్నం, టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



# ఏఐ ఆధారిత ఈసీడీ స్క్రీనింగ్‌తో చిన్నారుల సమగ్ర అభివృద్ధికి బాటలు

## అంగన్‌వాడీ కార్యకర్తలకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం

**పుల్లల చెరువు పెన్ పవర్ జూన్ 5**

చిన్నారుల శారీరక, మానసిక, సామాజిక అభివృద్ధిని శాస్త్రీయ పద్ధతుల్లో అంచనా వేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత ఈసీడీ స్క్రీనింగ్ విధానం గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారుల భవిష్యత్తుకు దోహదపడుతుందని ఎంపీడీవో మరియదాస్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన మండల స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జననం నుంచి ఆరు సంవత్సరాల వయస్సు వరకు పిల్లల ఎదుగుదల అత్యంత కీలకమైందని, ఈ దశలో వారి అభివృద్ధిని క్రమం తప్పకుండా పర్యవేక్షించడం ద్వారా భవిష్యత్తులో తలెత్తే సమస్యలను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఏఐ ఎనేబుల్డ్ ఈసీడీ స్క్రీనింగ్ యాప్ ద్వారా పిల్లల అభివృద్ధి స్థాయిని సులభంగా అంచనా వేసే అవకాశం కలుగుతుందని తెలిపారు. శిక్షణలో భాగంగా 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలను ఏ విధంగా స్క్రీనింగ్ చేయాలి, వారి శారీరక, మానసిక, భాషా, సామాజిక అభివృద్ధి ఎలా ఉందో గుర్తించే పద్ధతులపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. పిల్లల ఎదుగుదలలో కీలకమైన మైలురాళ్లు (మైల్‌స్టోన్స్) ఏవీ, వాటిని ఏ వయస్సులో సాధించాలి, ఆలస్యమైతే ఎలా గుర్తించాలి అనే అంశాలపై వివరించారు. అలాగే 0 నుంచి 3 సంవత్సరాల వయస్సు గల పిల్లల కోసం అమలు చేస్తున్న నవచేతన కార్యక్రమం, 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లల కోసం అమలు చేస్తున్న ఆధార్ శిలా





కార్యక్రమాల లక్ష్యాలు, అమలు విధానాలపై సమగ్రంగా చర్చించారు. చిన్నారుల మేధో వికాసం, భావోద్వేగ వికాసం, భాషా నైపుణ్యాల పెంపుదలలో ఈ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. స్క్రీనింగ్ నిర్వహించే సమయంలో తప్పనిసరిగా తల్లి లేదా సంరక్షకుల ఆమోదం తీసుకోవాలని, పిల్లల అభివృద్ధి అంచనాలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలతో లవ్, టాక్, ప్లే (ప్రేమగా మెలగడం, మాట్లాడడం, ఆడించడం) అనే మూడు అంశాలను నిత్యం పాటించడం ద్వారా పిల్లల సమగ్ర వికాసం సాధ్యమవుతుందని వివరించారు. పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సమతుల్య ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం, సకాలంలో వైద్య పరీక్షలు పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు అవసరమని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి చిన్నారి అభివృద్ధిని నిశితంగా పరిశీలించి అవసరమైన సూచనలు తల్లిదండ్రులకు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ, ఈ నెల 10వ తేదీ నుంచి ఏఐ ఆధారిత యాప్‌ను అంగన్‌వాడీ టీచర్ల మొబైల్ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేయనున్నట్లు తెలిపారు. యాప్ అమల్లోకి వచ్చిన తర్వాత ప్రతి చిన్నారి అభివృద్ధి వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేసి పర్యవేక్షించే అవకాశం ఉంటుందని చెప్పారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారికంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. చిన్నారుల భవిష్యత్తును మరింత మెరుగుపర్చే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకొస్తున్న ఈ ఆధునిక సాంకేతిక విధానాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

# సూపర్ నారి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి




**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 4**

మండల కేంద్రం సి ఎస్ పురం లో శుక్రవారం మండల సమాఖ్య అధ్యక్షురాలు బండారు సుబ్బమ్మ అధ్యక్షతన "మన డబ్బు -- మన లెక్కలు కార్యక్రమంలో భాగంగా పొదుపు సంఘాల సభ్యులకు ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పొదుపు సంఘాల సభ్యులు, సీసీలు, విఓఏలు, ఎస్ హెచ్ జి ఈసీ సభ్యులు పాల్గొని అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాల ప్రతినిధులకు ఆర్థిక నిర్వహణ, పొదుపు ప్రాధాన్యత, రుణాల వినియోగంపై అవగాహన కల్పించారు. సంఘ సభ్యులు తమ ఆర్థిక లావాదేవీలను పారదర్శకంగా నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం సీసీలు మాట్లాడుతూ ఆండ్రాయిడ్ మొబైల్ కలిగిన గ్రామ ఐక్య సంఘాల సభ్యులు తప్పనిసరిగా 'సూపర్ నారీ' యాప్ ను డౌన్లోడ్ చేసుకొని తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ యాప్ ద్వారా తీసుకున్న రుణాలు, చెల్లించిన వాయిదాలు, బకాయి వివరాలు, కుటుంబ సమాచారం, ఆర్థిక పరిస్థితి వంటి అంశాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. దీంతో సభ్యులకు సరైన సమాచారం అందడంతో పాటు పారదర్శకత పెరిగి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి సభ్యురాలు ఆర్థిక లావాదేవీలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని , సూపర్ నారీ యాప్ ను గ్రూపు సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో సిసి లు టి కాశయ్య, ఐ మస్తాన్ రెడ్డి, యం వి నారాయణమ్మ, విఓఏ లు, మరియు గ్రూపు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు సైకిల్ త్రొక్కిన ఎమ్మెల్యే ముత్తుముల

## సైకిల్ త్రొక్కటం పర్యావరణానికి, ఆరోగ్యానికి మేలు





**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 5**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో తన నివాసం నుండి సైకిల్‌పై ప్రయాణించి ఆదర్శంగా నిలిచారు. జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో రూ. 42.00 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆటిజం సెంటర్ భవన భూమిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే సైకిల్‌పై చేరుకొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు ఆయనతో కలిసి సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోకరెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న చిన్న మార్పుల ద్వారా పెద్ద ఫలితాలను సాధించవచ్చని అన్నారు. ఇంధన వినియోగాన్ని తగ్గించడం, కాలుష్య నియంత్రణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడంలో సైకిల్ వినియోగం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. అనంతరం ఆటిజం సెంటర్ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే , ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారుల అభివృద్ధికి ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పిల్లలకు ప్రత్యేక విద్య, థెరపీ, కౌన్సిలింగ్, పునరావాస సేవలు అందుబాటులోకి రావడంతో పాటు వారి కుటుంబాలకు ఇది ఒక ఆశాకిరణంగా నిలుస్తుందని అన్నారు. ప్రతి పిల్లవాడు ప్రత్యేకమే... ప్రతి పిల్లవాడికి అవకాశం దక్కాలి" అనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, గిద్దలూరు నియోజకవర్గంలో ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు , స్థానికులు పాల్గొన్నారు.

# ఆర్డీఓ ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా వి ఆర్ ఓ లా సంఘం



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 5**

నూతన మార్కాపురం రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ గా బాధ్యతలు చేపట్టిన యమ్. వెంకట శివరామిరెడ్డి ని ఆయన కార్యాలయం లో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం మార్కాపురం జిల్లా అధ్యక్షులు వై పి రంగయ్య, ఆధ్వర్యంలో శుక్రవారం నాడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమలో జిల్లా ఉపాధ్యక్షులు అరిగేల. వెంకట రామయ్య, జిల్లా నాయకులు బిజ్జం. రాజశేఖర్ రెడ్డి, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ అజయ్ కుమార్ నాయకులు సిరిగిరి. వీరనారయణ, నీలి. శంకర్, ఎడమ. రంగస్వామి పాల్గొన్నారు.

# ఆనంద ఆశ్రమాన్ని సందర్శించిన శ్రీ పరిపూర్ణ సిద్ధానంద స్వామి



**దొనకొండ జూన్ 5 పెన్ పవర్**

మండల కేంద్రంలోని విరాట్ నగర్ లో గల శ్రీ ఆనంద ఆశ్రమంలో ఒంగోలు శ్రీ అచలానంద ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ పరిపూర్ణ సిద్ధా నంద స్వామి వారు శుక్రవారం దొనకొండ శ్రీ ఆనంద ఆశ్రమంలో నిత్యము జరిగే పూజా విధానాలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు భగవద్గీత బోధనలు పిల్లలకు ఉచిత కోలాటం నిత్య అన్నదానాలు గురించి శ్రీ భైరవానంద స్వామి వారిని అడిగి తెలుసుకుంనారు. దొనకొండ ఆనందాశ్రమంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు విస్తరిస్తూ పోతుందని ఇంత మారుమూల ప్రాంతంలో ఈ యొక్క ఆశ్రమాన్ని నెలకొల్పి ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న భైరవానంద స్వామికి భక్తులు ఆర్థికంగా అండగా ఉండి ఆశ్రమంలో జరిగే కార్యక్రమాలను ముందుకు నడిపించాలని శ్రీ పరిపూర్ణ సిద్ధానంద స్వామి వారు అన్నారు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు శిష్యులు పాల్గొన్నారు వచ్చిన వారందరికీ భైరవానంద స్వామి అన్నదానం చేశారు.

# అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంను జయప్రదం చేయాలి

## కాలువ నరసయ్య

**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 5**

కనిగిరి లోని స్థానిక ఒంగోలు బస్టాండ్ వద్ద నేడు నిర్వహించనున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని జయప్రదం చేయాలని మండల టిడిపి ఎస్సీ సెల్ నాయకులు కాలువ నరసయ్య పిలుపునిచ్చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహోన్నత వ్యక్తి అంబేద్కర్ ఆశయాలు సమాజంలో ప్రతి ఒక్కరికి ఆదర్శనీమని కొనియాడారు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమమునకు మండలంలోని అంబేద్కర్ అభిమానులు టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు



# అర్ధవీడులో మన డబ్బులు మన లెక్కలపై ర్యాలీ






**అర్ధవీడు, పెన్ పవర్, జూన్ 5**

మన డబ్బులు మన లెక్కలు అనే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన అర్ధవీడు నందు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గిద్దలూరు ఎల్సి రంగనాయకులు మాట్లాడుతూ ఈ నారీ లు, సిఆర్పిలు సూపర్ నారి అనే యాప్ ను డౌన్లోడ్ చేసుకొని డ్వాక్రా సంఘ సభ్యులందరికీ కూడా యాప్ ను డౌన్లోడ్ చేయాలని తెలియజేశారు. దీని ద్వారా మనం ఎంత పొదుపు చేసింది, ఎంత డబ్బులు కడుతున్నది, ఎంత అప్పు ఉన్నది అని వివరాలను పొందుపరచడం జరుగుతుందన్నారు. ఎలాంటి అవినీతి లేకుండా ఉండేందుకు మన డబ్బులు మన లెక్కలు అనే యాప్ ను ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. ఇందులో ఏమైనా తప్పులు ఉన్నట్లయితే ఈ నారీ లకు తెలియజేయడమే కాకుండా వివో ఏ లకు తెలియజేసినట్లయితే అందులోని తప్పులను సరి చేయడం జరుగుతుందని ఎప్పటికప్పుడు అప్డేట్ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిసిలు గురువయ్య, శారద వివోఏలు డ్వాక్రా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గిద్దలూరు పట్టణంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

## అమ్మ కోసం ఒక చెట్టు కార్యక్రమంలో బీజేపీ నాయకులు



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 5**

భారతీయ జనతా పార్టీ గిద్దలూరు బిజెపి నాయకులు అప్పిశెట్టి ఉదయ శంకర్ ఆధ్వర్యం లో జాతీయ పర్యావరణం దినోత్సవము సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆర్టీసీ ఆర్ఎం ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్టీసీ ఎంప్లాయిస్ ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి జే వి నారాయణ, మైనార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఖాదర్ వలీ షఫీ, గిద్దలూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దూదేకుల భాదుల్లా, నెమలిగుండ్ల రంగస్వామి కమిటీ నెంబర్ కుప్పల నరసింహులు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కాకనూరి తిరుపాల రెడ్డి, రాచర్ల కాసులు కాసులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. డాక్టర్ జే వి నారాయణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతుగా మొక్కలు నాటి వాటి ఎదుగుదలకు తోడ్పడాలని, అప్పుడే సకాలం లో వర్షాలు కురిసే అవకాశాలు మెండుగా ఉంటాయని ఇది ఏదో ఎవరో చేస్తారని నిర్లక్ష్యం చేయకుండా మొక్కలు నాటడం ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకొని ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

# పర్యావరణ పరిరక్షణకు భావితరాల కోసం తల్లి పేరుతో మొక్కలు నాటి సంరక్షించాలి -మాదినేని లక్ష్మణ్





**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 5**

వాతావరణ సమతుల్యత పర్యావరణ పరిరక్షణకు భావితరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని రాష్ట్ర మాజీ బిజెపి ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు మాదినేని లక్ష్మణ్ అన్నారు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివియన్ మాధవ్ ఆదేశాల మేరకు జిల్లా బిజెపి అధ్యక్షులు పి వి కృష్ణారావు సూచనలతో శుక్రవారం మండలంలోని రేగులచెలక గ్రామంలో బిజెపి సీనియర్ నాయకులు సాదు వెంకటేశ్వర్లు, వెలిగండ్ల మండలంలోని చోడవరం గ్రామంలో మండల బిజెపి అధ్యక్షులు రమణయ్య ఆధ్వర్యంలో మొక్కలు నాటారు ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మాదినేని లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుట మొక్క నాటాలని , పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అన్నారు మనం నాటే ప్రతి మొక్క చెట్టుగా ఆవిర్భవించి భావితరాలకు ఉపయోగపడుతుందని అన్నారు మొక్కలు నాటడం వల్ల మన తల్లి మనకు జీవాన్ని ప్రసాదించినట్లే మొక్కలు ఈ భూమికి ప్రాణవాయువును అందిస్తాయని,స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన పర్యావరణం అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి తమ వంతు భాగస్వాములు కావాలని అన్నారు ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, భూగర్భ జలాల క్షీణత వంటి సమస్యలకు మొక్కల పెంపకమే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు. చెట్లు కార్బన్ డై ఆక్సైడ్ను గ్రహించి ఆక్సిజన్ను విడుదల చేయడం ద్వారా జీవరాశుల మనుగడకు దోహదపడతాయని తెలిపారు.పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించి పెద్ద చెట్లుగా పెంచాలని సూచించారు. “ఒక కుటుంబం – ఒక మొక్క” అనే లక్ష్యంతో ప్రతి ఇంటా కనీసం ఒక మొక్కను నాటాలని కోరారు. పచ్చదనం పెంపొందితే వర్షపాతం మెరుగుపడటంతో పాటు ప్రకృతి సమతుల్యత కూడా కాపాడబడుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి రమణారెడ్డి, రాజేష్ పలువురు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నవచేతనపై అవగాహన కార్యక్రమం



**పొన్నలూరు పెన్ పవర్ జూన్ 5**

చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదల సమగ్ర అభివృద్ధి దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అమలు చేస్తున్న నవచేతన కార్యక్రమం పై శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీలకు అవగాహన కార్యక్రమం కల్పించారు. ఆరు సంవత్సరాల లోపు పిల్లల ఎదుగుదల అభివృద్ధిని క్రమం తప్పకుండా పరిశీలించి సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించే చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. జీవితంలో చిన్నారులకు తొలి వెయ్యి రోజులు అత్యంత కీలకమని, ఈ దశలో మెదడు అభివృద్ధి వేగంగా జరుగుతుందని వివరించారు. పిల్లలు ఎదుగుదలలో సమస్యలు కనిపిస్తే వెంటనే వైద్య సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సుశీల, ఎంపీడీవో సుజాత, వైద్య అధికారులు రవికిరణ్ మల్లికార్జునరావు, ఐ సి డి ఎస్ సూపర్వైజర్ రిజ్వాన, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పొదుపు భద్రతపై అవగాహన కార్యక్రమం




**పొన్నలూరు పెన్ పవర్ జూన్ 5**

మన డబ్బు మన లెక్కలు పొదుపు భద్రత కొరకు, అప్పు లెక్కల కొరకు మండలంలోని వెంకుపాలెం గ్రామంలో శుక్రవారం ఎస్సీ ఆర్ పి ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్థిక పారదర్శకం కొరకు సూపర్ నారీ యాప్ ప్రవేశ పెట్టడం జరిగిందని దానిలో భాగంగా వెంకుపాలెం గ్రామంలో సంఘం సభ్యులకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీసీ వెంకటేశ్వర్లు డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు అందరూ సమన్వయంతో పనిచేయాలి

### ఎంపీపీ బోరిగోర్ల ఉషారాణి మురళి





**దొనకొండ,జూన్ 05 : పెన్ పవర్**

దొనకొండ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బోరిగొర్ల ఉషారాణి మురళి మరియు మండల అభివృద్ధి అధికారి వసంతరావు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మండలం లోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు సంక్షేమ పథకాల అమలు తాగునీరు విద్యుత్ రహదారులు పారిశుధ్యం విద్య వైద్య సేవలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు పర్యావరణ పరిరక్షణ అంశంపై పలువురు వాక్యానించారు.ప్రతి ఒక్కరు చెట్టు నాటాలని తెలిపారు మండల అభివృద్ధికి సంబంధించిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు. ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో మండల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# పొదిలిలో చంద్రబాబు పై వైఎస్ఆర్సిపి నిరసన






**పొదిలి, పెన్ పవర్, జూన్ 5**

పొదిలిలో చంద్రబాబు వెన్నుపోటు పై వైఎస్ఆర్సిపి నిరసన కార్యక్రమం నిర్వహించింది. శుక్రవారం నాడు మార్కాపురం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు స్థానిక పాత బస్టాండ్ సెంటర్ లోని డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం చంద్రబాబు వెన్నుపోటు పై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వైకాపా నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న రాంబాబు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతి గురించి మండిపడ్డారు. చంద్రబాబు ప్రభుత్వ తీరును, సాగిస్తున్న అవినీతి కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని, ఈసారి చంద్రబాబుకు ప్రజలు తగిన సమయంలో సరైన గుణపాఠం నేర్పుతారని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ మస్తాన్ వలి, సయ్యద్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం దర్శనానికి విచ్చేసిన మాతాజీకి స్వాగతం పలికిన పత్తి రామమూర్తి



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 5**

సాధ్వి సుమనపురి సేవిక సమితి కార్యకర్త మాతాజీ ఆగస్టు 2024 నుంచి చార్ధామ్ యాత్రతో పాటు 10 జ్యోతిర్లింగ క్షేత్రాలను దర్శించుకుంటూ శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనార్థం విచ్చేసిన సందర్భంగా శుక్రవారం జిల్లా పర్యటన ప్రముక్ గ్రామ వికాస్ తిరుమలనాథస్వామి సేవకుడు పత్తి రామమూర్తి మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పత్తి రామమూర్తి మాట్లాడుతూ భారతదేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శిస్తూ ఆధ్యాత్మిక యాత్ర కొనసాగిస్తున్న మాతాజీ ఇప్పటికే 10 జ్యోతిర్లింగ క్షేత్రాలను దర్శించుకున్నారని తెలిపారు. పల్నాడు జిల్లా, నంద్యాల జిల్లా, ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మార్గం గుండా శ్రీశైలం దేవస్థానానికి చేరుకుని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని దర్శించుకోనున్నట్లు తెలిపారు మల్లికార్జున స్వామి దర్శనం అనంతరం కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల మీదుగా రామేశ్వరం క్షేత్రానికి యాత్ర కొనసాగించనున్నారని చెప్పారు. ఆధ్యాత్మిక యాత్రలు భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ వైభవాన్ని చాటిచెప్పే గొప్ప సాధనమని పేర్కొన్నారు.యాత్ర సందర్భంగా స్థానిక కార్యకర్తలు సమన్వయంతో మాతాజీతో మమేకమై ప్రయాణంలో భాగస్వాములయ్యారని, వారి సేవాభావం అభినందనీయమని రామమూర్తి అన్నారు. భక్తి, సేవ, సంస్కృతి పరిరక్షణ లక్ష్యాలతో సాగుతున్న ఈ యాత్ర అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.



# ఊరుసు మహోత్సవంలో ముత్తుముల



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 5**

రాచర్ల మండలం గుడిమెట్ట గ్రామంలో జరుగుతున్న మౌలాలి స్వామి ఉరుసు మహోత్సవంలో గిద్దలూరు శాసనసభ్యులు అశోక్ రెడ్డి పాల్గొ ప్రత్యేక ప్రార్థనలు చేశారు గ్రామ ప్రజలు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి కి సాదర స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు, అనంతరం దర్గాలో ప్రతేక ప్రార్ధనలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి వెంట రాచర్ల మండలం టీడీపీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# ప్రతి ఒక్కరు మొక్కలు నాటి కాపాడుకోవాలి




**పొన్నలూరు పెన్ పవర్ జూన్ 5**

పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీవో పి సుజాత అన్నారు. స్థానిక సచివాలయంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సుజాత మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి దానిని సంరక్షించే బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. మొక్కలు పెంపకం వల్ల కాలుష్యాన్ని తగ్గించవచ్చని, భూగర్భ జలాలు కూడా మెరుగుపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సుధాకర్, మండవ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నారాయణ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బాలురు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

### పంచాయతీ అధికారి బివి నాయుడు

**పొదిలి, పెన్ పవర్, జూన్ 5**

బాలురు బాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని గ్రామ పంచాయతీ అధికారి బివి నాయుడు చెప్పారు. శుక్రవారం నాడు మండల కేంద్రమైన మర్రిపూడి సచివాలయంలో కిశోర వికాస శారీరక మానసిక మార్పులపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న పంచాయతీ అధికారి బివి నాయుడు మాట్లాడుతూ యుక్త వయస్సులో యువకులు ఎటువంటి చెడు వ్యసనాలకు ఆకర్షితులు అయినా, వారి బంగారు భవిష్యత్తు అంధకారం అవుతుందని హెచ్చరించారు. వి ఆర్ ఓ బడే సాహెబ్ మాట్లాడుతూ యువకులు క్రీడలు, సృజనాత్మక రంగాలపై దృష్టి సారించాలని సూచించారు. అంగ న్ వాడి కార్యకర్త కె.పి హైమావతి మాట్లాడుతూ జీవనానికి పాటించాల్సిన పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్ నరసారెడ్డి, మహిళా పోలీస్ కృష్ణవేణి, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రతాపరెడ్డి, అంగన్వాడి కార్యకర్తలు హైమావతి, కామేశ్వరి, సచివాలయ సిబ్బంది, కిశోర బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌లో ఉండటం కోహ్లీకి ఇష్టం లేదు.. అందుకే లండన్‌లో సెటిల్!



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ బ్యాటర్, ఆర్‌సీబీ ఆటగాడు విరాట్ కోహ్లీకి భారత్‌లో ఉండటం ఇష్టం లేదని సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేయర్ లియామ్ లివింగ్ స్టోన్ సంచల న వ్యాఖ్యలు చేశాడు. ప్రశాంతమైన జీవితాన్ని విరాట్ కోహ్లీ కోరుకుంటున్నాడని, తన ఫ్యామిలీతో ఎక్కువ సమయాన్ని గడపాలనుకుంటున్నాడని పేర్కొన్నాడు. అందుకోసమే అతడు లండన్‌లో సెటిల్ అయ్యాడని తెలిపాడు.ప్రస్తుతం భారత్‌తో తాను గడుపుతున్న జీవితాన్ని విరాట్ కోహ్లీ పెద్దగా ఇష్టపడటం లేదు.. అందరి కళ్లూ ఎప్పుడూ తనపైనే ఉండాలని అతను అస్సలు అనుకోడని పేర్కొన్నాడు. కోహ్లీ చాలా మంచి వ్యక్తి.. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆర్‌సీబీకి ప్రాతినిథ్యం వహించిన లియామ్ లివింగ్ స్టోన్.. తాజా సీజన్‌లో సన్‌రైజర్స్ తరపున ఆడాడు.. ఇటీవలే ఐపీఎల్ ముగియడంతో స్వదేశానికి వెళ్లిన లివింగ్ స్టోన్.. అక్కడ ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్లతో కలిసి ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా కింగ్ కోహ్లీపై ప్రశంసలు కురిపించాడు.

విరాట్ కోహ్లీ అద్భుతమైన వ్యక్తి.. నేను ఎప్పుడూ అతనికి ప్రత్యర్థిగానే ఆడా.. కోహ్లీ ఎప్పుడూ స్మైల్ తోనే కనిపిస్తాడు. అతనితో గొడవకు దిగితే అదే రీతిలో సమాధానం ఇస్తాడు. కానీ స్టేడియంలో మాత్రం పోటీతత్వంతో ఆడుతాడు. కోహ్లీ.. బౌండరీ లైన్ దాటి మైదానంలో అడుగు పెట్టగానే మారిపోతాడు.. కానీ గ్రౌండ్ బయట అతను అద్భుతమైన వ్యక్తి.. చాలా ప్రశాంతంగా ఉంటాడని లివింగ్ స్టోన్ వెల్లడించాడు.

ఆర్‌సీబీ కోచింగ్ స్టాఫ్ మోబాట్, ఆండీ ఫ్లవర్ విరాట్ కోహ్లీ ఆడే విధానాన్ని పూర్తిగా మార్చేశారని లియామ్ లివింగ్ స్టోన్ చెప్పుకొచ్చాడు. కొంచెం దూకుడుగా ఆడాలని, సిక్సర్లు కొట్టాలని కోహ్లీకి సూచించడంతో.. అతడి ఆటతీరు పూర్తిగా మారింది. గతానికి భిన్నంగా కోహ్లీ దూకుడుగా ఆడుతున్నాడు. స్పిన్ బౌలింగ్‌లోనూ భారీ షాట్స్ కొడుతున్నాడని లివింగ్ స్టోన్ పేర్కొన్నాడు.

# ఐపీఎల్‌లో తోపు.. మహారాజా ట్రోఫీలో కేఎల్ రాహుల్‌ని పట్టించుకోని ఫ్రాంచైజీలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్-2026లో అద్భుతమైన ఫామ్‌తో దుమ్మురేపిన టీమిండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్‌కు తన సొంత గడ్డపైనే ఊహించని షాక్ తగిలింది. కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహారాజా ట్రోఫీ టీ20 లీగ్ మెగా వేలంలో రాహుల్‌ను కొనుగోలు చేయడానికి ఏ ఫ్రాంచైజీ కూడా ఇంట్రెస్ట్ చూపించలేదు.. రూ.2 లక్షల బేస్ ప్రైస్‌తో వేలంలోకి వచ్చిన కేఎల్ రాహుల్.. చివరికి అన్‌సోల్డ్ ) ప్లేయర్‌గా మిగిలిపోవడం అందరినీ షాక్ కి గురి చేసింది.

**ఎందుకు తీసుకోలేదంటే?:**

ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నప్పటికీ కేఎల్ రాహుల్‌ను ఏ జట్టూ తీసుకోకపోవడానికి ప్రధాన కారణం అతడు అందుబాటులో ఉండటంపై స్పష్టత లేకపోవడమేనని తెలుస్తోంది. జూన్ నెలలో భారత జట్టు అంతర్జాతీయ మ్యాచ్‌లతో ఫుల్ బిజీగా ఉండబోతుంది. జూన్ 6 నుంచి ఆఫ్ఘనిస్తాన్‌తో జరగబోయే ఏకైక టెస్ట్ మ్యాచ్‌కు రాహుల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. అనంతరం జూన్ 13 నుంచి జరగనున్న వన్డే సిరీస్‌లోనూ ఆడనున్నాడు. అంతేకాదు, జూలై రెండో వారంలో కూడా వన్డే సిరీస్ కోసం ఇంగ్లాండ్ పర్యటనకు కేఎల్ రాహుల్ వెళ్లనున్నాడు.

**జాతీయ జట్టు బాధ్యతల వల్లే దూరం:**

ఇలా వరుసగా అంతర్జాతీయ మ్యాచ్‌లు, జాతీయ జట్టు బాధ్యతలు ఉండటంతోనే ఈ మహారాజా టీ20 లీగ్‌లో కేఎల్ రాహుల్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండే అవకాశం లేదు.. అందుకే ఫ్రాంచైజీలు అతనిపై బిడ్ వేయడానికి వెనుకాడుగు వేశాయి. కాగా.. ఈ ప్రతిష్టాత్మక మహారాజా ట్రోఫీ టీ20 లీగ్ మ్యాచ్‌లు మొత్తం హుబ్లీ, మైసూర్, బెంగళూరు నగరాల్లో జరగబోతున్నాయి.



# టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌లో మళ్లీ రచ్చ.. నెట్టింట గంభీర్ వ్యాఖ్యలపై జోరుగా చర్చ

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య జూన్ 6 నుంచి చండీగఢ్‌లో జరగబోయే మొదటి టెస్ట్ మ్యాచ్‌కు ముందు టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఈ సిరీస్ కోసం రిషబ్ పంత్‌ను వైస్ కెప్టెన్సీ పదవి నుంచి తొలగించి, ఆ బాధ్యతలను కేఎల్ రాహుల్‌కు అప్పగించడంపై గంభీర్ ఓపెన్ అయ్యాడు. ఐపీఎల్‌లో 14 మ్యాచ్‌ల్లో కేవలం 312 రన్స్ చేయడమే కాకుండా, సౌతాఫ్రికాతో జరిగిన గత టెస్ట్ సిరీస్‌లో 12.25 యావరేజ్‌తో కేవలం 29 రన్స్ మాత్రమే చేసి పంత్ తీవ్రంగా నిరాశపరిచాడు. ఈ ఫామ్ ఎఫెక్ట్ వైస్ కెప్టెన్సీపై పడినట్లు వార్తలపై గంభీర్ స్పందించాడు.



**కెప్టెన్సీ అనేది బై ప్రొడక్ట్ మాత్రమే:**

రిషబ్ పంత్ వైస్ కెప్టెన్సీ మార్పుపై గంభీర్ మాట్లాడుతూ.. ఆటగాడికి అసలైన బాధ్యత దేశం కోసం ఆడటమే.. కెప్టెన్సీ, వైస్ కెప్టెన్సీ అనేవి కేవలం బై ప్రొడక్ట్స్ మాత్రమే.. పంత్ తన సహజసిద్ధమైన ఆటను మార్చుకోవాలని మేము చెప్పం.. కానీ, మ్యాచ్ సిట్యుయేషన్‌ను బట్టి ఆడటం చాలా ముఖ్యం.. పరుగులు చేయడం, వికెట్లు తీయడమే అసలైన టార్గెట్ అని స్పష్టం చేశాడు.

**నెంబర్ 3 బ్యాటింగ్ పై క్లారిటీ:**

మరోవైపు నంబర్ 3 బ్యాటింగ్ పొజిషన్‌పై కూడా కోచ్ గంభీర్ క్లారిటీ ఇచ్చాడు. దేవదత్ పడిక్కల్ నుంచి గట్టి పోటీ వస్తున్నప్పటికీ, సాయి సుదర్శన్‌కే తాము అండగా ఉంటామని చెప్పాడు. సుదర్శన్‌కు నంబర్ 3లో తగినన్ని అవకాశాలు రాలేదని, ఇంగ్లాండ్‌లో కెరీర్ స్టార్ట్ చేయడం అంత ఈజీ కాదని గంభీర్ గుర్తు చేశాడు. ఐపీఎల్‌లో అద్భుతంగా రాణించిన సుదర్శన్‌కు లాంగ్ రన్ ఇస్తామని కోచ్ భరోసా ఇచ్చాడు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌ను 2--2తో డ్రా చేసుకోవడం, గత మ్యాచ్‌ల్లో ఓడిపోవడంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఇండియా ప్రస్తుతం 6వ స్థానానికి పడిపోయింది. దీనిపై గంభీర్ మాట్లాడుతూ.. మేము ఎప్పుడూ పాజిటివ్‌గానే ఉంటాం.. డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న ప్రతి ఒక్కరికీ డబ్ల్యూటీసీ ఫైనల్ చేరతామనే నమ్మకం ఉంది.. మాకున్న క్వాలిటీ, టాలెంట్‌తో మేము ఫైనల్ గెలవలేకపోవడానికి ఎలాంటి కారణం లేదని ధీమా వ్యక్తం చేశాడు.

# బీచ్‌లో మధురిమ బికినీ రచ్చ.. నెటిజన్లు ఫిదా!

టాలీవుడ్‌లో అల్లరి నరేష్ సరసన ‘సరదాగా కాసేపు’ సినిమాలో హీరోయిన్‌గా నటించి మెప్పించిన అందాల భామ మధురిమ గుర్తుంది కదా! ఆమె అసలు పేరు నైరా బెనర్జీ. సౌత్‌లో స్టార్ హీరోయిన్‌గా రాణించలేకపోయినా, ప్రస్తుతం బాలీవుడ్, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో బిజీగా ఉంటోంది. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ, తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన కొన్ని బికినీ ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. ఆ హాట్ ఫోటోల ముచ్చట్లు, ఇప్పుడు చూద్దాం..

**టాలీవుడ్ జర్నీ గుర్తుందిగా:**

నైరా బెనర్జీ తెలుగు ప్రేక్షకులకు ‘మధురిమ’గానే బాగా పరిచయం. 2009లో ‘ఆ ఒక్కడు’ సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత ఆరెంజ్, షాడో, కొత్త జంట, టెంపర్ లాంటి పెద్ద సినిమాల్లో క్రేజీ క్యారెక్టర్స్ చేసింది. 2015లో దోచేయ్ సినిమాలో ఒక స్పెషల్ సాంగ్‌లో మెరిసిన తర్వాత ఈమె టాలీవుడ్‌కు కాస్త దూరమైంది. కానీ, హిందీ ఇండస్ట్రీలో మాత్రం వరుస ఆఫర్లతో దూసుకుపోతోంది.



**ఆకట్టుకుంటున్న బికినీ లుక్:**

తాజాగా నైరా గోవా బీచ్‌లో దిగిన కొన్ని కిల్లర్ ఫోటోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. రంగురంగుల ఫ్లోరల్ ప్రింట్ ఉన్న హాల్టర్ స్టైల్ బికినీ టాప్, దానికి మ్యాచ్ అయ్యే స్ట్రింగ్ బాటమ్స్ వేసుకుని ఇసుక తిన్నెలపై అద్దాల నటిలా మెరిసిపోయింది. ఇక తడిసిన జుట్టును వెనక్కి వేసి, సన్ కిస్డ్ గ్లామర్‌తో ఆమె ఇచ్చిన పోజులు కుర్రాళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి.

**క్యాప్షన్ అదిరింది బాసూ:**

ఈ హాట్ పిక్స్ పోస్ట్ చేస్తూ ఆమె పెట్టిన క్యాప్షన్ కూడా తెగ వైరల్ అవుతోంది. “మషూకా హూ!!! హ్యాండిల్ చేయడం కష్టం కాదు కానీ, మర్చిపోవడం చాలా కష్టం. రెడ్ ఫ్లాగ్ ఆ.. లేక రిలేషన్‌షిప్ గోలా?” అంటూ ఒక క్రేజీ లైన్ రాసుకొచ్చింది. ఇక దీనికి నెటిజన్లు “నువ్వు ఎప్పటికీ రిలేషన్‌షిప్ గోల్స్ క్వీన్‌వే” అంటూ హార్ట్, ఫైర్ ఎమోజీలతో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

**బాలీవుడ్‌లో బ్యాక్ టు బ్యాక్ హిట్స్:**

నైరా కేవలం గ్లామర్ షోకే పరిమితం కాకుండా నటిగానూ ప్రూవ్ చేసుకుంటోంది. రీసెంట్‌గా అశుతోష్ రాణా, అభిమన్యు సింగ్‌లతో కలిసి ఆమె నటించిన బాలీవుడ్ యాక్షన్-కామెడీ మూవీ ‘వన్ టూ చా చా చా’ రిలీజ్ అయి మంచి హిట్ కొట్టింది. అలాగే ‘మై వైఫ్ రెంటెడ్ మీ అవుట్’ అనే మినీ టీవీ సిరీస్‌తో పాటు, ‘ఖాకీ 2’ లాంటి పాపులర్ వెబ్ సిరీస్‌లలో కూడా నటిస్తూ ఓటీటీలో ఫుల్ బిజీగా గడుపుతోంది.

ఏదేమైనా, సినిమాల్లో ట్రెడిషనల్ లుక్స్‌తో అలరించిన ఈ మధురిమ.. ఇప్పుడు నైరా బెనర్జీగా బాలీవుడ్‌లో గ్లామర్ అండ్ యాక్టింగ్‌తో సెకండ్ ఇన్నింగ్స్ సూపర్బ్‌గా లీడ్ చేస్తోంది. ఇక వెండితెరపైనే కాదు, సోషల్ మీడియాలోనూ ఈమె రేంజ్ రోజురోజుకూ పెరిగిపోతోంది. మరి ఈ ముద్దుగుమ్మ ముందు ముందు మరిన్ని మంచి ప్రాజెక్టులతో తెలుగులోకి కూడా రీఎంట్రీ ఇవ్వాలని ఆశిద్దాం.



# శింబుతో సినిమా చూడాలనుంది: మీనాక్షి

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న కథానాయిక మీనాక్షి చౌదరి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. తెలుగు, తమిళ భాషల్లో వరుస అవకాశాలు అందుకుంటున్న ఈ అందాల నటి, ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తమిళ స్టార్ హీరో శింబుపై తన అభిమానాన్ని వ్యక్తం చేశారు. ఇంటర్వ్యూలో భాగంగా “సినీ పరిశ్రమకు చెందిన ఏ హీరోతోనైనా సినిమా చూడడానికి వెళ్లే అవకాశం వస్తే ఎవరిని ఎంచుకుంటారు?” అనే ప్రశ్నకు మీనాక్షి ఏమాత్రం ఆలోచించకుండా శింబు పేరును చెప్పారు. “సినిమా చూడటానికి వెళ్లాలంటే నేను ఖచ్చితంగా శింబు గారినే ఎంచుకుంటాను” అంటూ సమాధానమిచ్చారు. ఆయన నటన, తెరపై కనిపించే తీరు తనకు ఎంతో ఇష్టమని పేర్కొన్నారు. మీనాక్షి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం అభిమానుల మధ్య చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా శింబు అభిమానులు ఈ వ్యాఖ్యలను ఆనందంగా స్వాగతిస్తూ, వీరిద్దరి కలయికలో ఒక చిత్రం వస్తే చూడాలని ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, తమిళ సినీ వర్గాల్లో వినిపిస్తున్న కథనాల ప్రకారం శింబు కథానాయకుడిగా తెరకెక్కుతున్న ఓ భారీ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయికగా నటించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వార్తల మధ్య ఆమె చేసిన వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రస్తుతం మీనాక్షి చౌదరి తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో బిజీగా గడుపుతున్నారు. వరుస విజయాలతో ఆమెకు ‘అదృష్ట కథానాయిక’ అనే పేరు కూడా వచ్చింది. తెలుగులో పలు ప్రతిష్టాత్మక చిత్రాల్లో నటిస్తూనే, తమిళంలోనూ వరుస అవకాశాలను అందుకుంటున్నారు. హర్యానాకు చెందిన మీనాక్షి చౌదరి వృత్తిరీత్యా దంత వైద్యురాలు. విద్యాభ్యాసం పూర్తయ్యాక మోడలింగ్ రంగంలో అడుగుపెట్టి జాతీయ స్థాయి అందాల పోటీల్లో గుర్తింపు పొందారు. అనంతరం సినీ రంగంలోకి ప్రవేశించి తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ అగ్ర కథానాయికల జాబితాలో చోటు సంపాదించారు. ప్రస్తుతం ఆమె నటిస్తున్న కొత్త చిత్రాలపై కూడా సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. వరుస విజయాలతో ముందుకు సాగుతున్న మీనాక్షి చౌదరి పేరు మరోసారి వార్తల్లో నిలవడానికి శింబుపై చేసిన ఈ వ్యాఖ్యలే కారణమయ్యాయి.





Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com